PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 343 | విజయవాడ, సోమవారం 14 జులై 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday14 July 2025 | Rs

రాజ్యసభకు శ్రింగ్లా, మీనాక్షి, ఉజ్వల్, సదానందన్

- నామినేట్ చేసిన రాష్ట్రపతి

5

గృహ నిర్బంధంలో భాగంగా సిపిఎం ఎమ్మెల్యే ఎంవై తరిగామి నివాసం గేట్లుకు తాళాలు వేసిన పోలీసులు

జమ్ముకాశ్మీర్‌లో ఆంక్షలు

- మంత్రులుసహా ప్రముఖుల హౌస్ అరెస్టు 5
- కేంద్రం తీరు సిగ్గుచేటు : సిఎం ఒమర్ అబ్దుల్లా

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు కన్నుమూత

- ఎపి సిఎం చంద్రబాబు నివాళి
- ప్రధాని మోడీ, తెలంగాణ సిఎం సంతాపం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు (83) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. కోట శ్రీనివాసరావుకు భార్య రుక్మిణి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన భౌతికకాయానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన మృతి విచారకరమని, తెలుగు సినీ రంగానికి తీరని లోటని పలువురు తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జూబ్లిహిల్స్ మహాప్రస్థానంలో కోట అంత్యక్రియలను కుటుంబ సభ్యులు సాయంత్రం నిర్వహించారు. 1942 జులై పదిన కృష్ణా జిల్లా కంకిపాడులో కోట జన్మించారు. సినిమాల్లోకి రాక ముందు స్టేట్ బ్యాంకులో పనిచేశారు. తెలుగుతోపాటు, తమిళం, హిందీ, కన్నడ చిత్రాల్లో కూడా నటించారు. వైవిధ్యభరితమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. నట జీవితంలో తొమ్మిది 'నంది' పురస్కారాలు కైవసం చేసుకున్నారు. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు సినీ, నాటక రంగాలకు ఆయన సేవ చేశారు. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎన్నో మధురమైన పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల మదిలో శాశ్వత ముద్ర వేసుకున్నారు. 1999 నుంచి 2004 వరకు విజయవాడ తూర్పు నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యేగా పనిచేశారు. దర్శకుడు, నిర్మాత క్రాంతికుమార్ ఆయనకు వెండి తెరపై తొలి అవకాశం ఇచ్చారు. 1978లో 'ప్రాణం మిగతా 2లో

బిజెపికి రూ.97 కోట్ల విరాళం

- నాలుగు రెట్లు పెరిగిన 'వేదాంత' చెల్లింపులు

న్యూఢిల్లీ : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి కార్పొరేట్ కంపెనీలు ఇచ్చే విరాళాలు ఏటా అనేక రెట్లు పెరిగిపోతున్నాయి. 'క్విడ్ ప్రోకో' ఆరోపణలు, కొన్ని కార్పొరేట్ సంస్థలపై బెదిరింపులు, కేంద్ర సంస్థలతో దాడులకు పాల్పడుతుందన్న ఆరోపణలు తరచూ వస్తున్న నేపథ్యంలో... అవి ఇచ్చే మొత్తం విరాళాల్లో సింహభాగం కమలం పార్టీకే వెళ్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బిలియ నీర్ అనిల్ అగర్వాల్‌కి చెందిన వేదాంత లిమిటెడ్ రూ.97 కోట్లు బిజెపికి ఇచ్చింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే నాలుగు రెట్లు అంటే 88 శాతం పెరిగినట్లు ఆ సంస్థ తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2024-25లో ఆ సంస్థ ఇచ్చిన రాజకీయ విరాళాలు రూ.157 కోట్లు కాగా, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే రూ.97 కోట్లు అదనం. 2024-25 వార్షిక నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 2024 నుండి మార్చి 2025 ఆర్థిక సంవత్సరంలో బిజెపికి రూ.97 కోట్లు (మార్చి 31, 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.26 కోట్లు), బిజు జనతాదళ్ రూ.25 కోట్లు (2024లో రూ.15 కోట్లు), జార్ఖండ్ ముక్తి మోర్చా రూ.20 కోట్లు (2024లో రూ.5 కోట్లు), కాంగ్రెస్‌కు రూ.10 కోట్లు (2024లో రూ.49 కోట్లు) ఉన్నాయి. 2022-23లో రూ.155 కోట్లు, 2021-22లో రూ.123 కోట్లు విరాళంగా రాజకీయ పార్టీలకు ఇచ్చినట్లు ప్రకటించినా, ఏఏ పార్టీలకు ఎంత మొత్తం ఇచ్చిందన్న వివరాలను వెల్లడించలేదు. 'ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధం'గా పేర్కొంటూ గత ఏడాది సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. 2017 నుంచి బాండ్లు రద్దయ్యేవరకూ ఐదేళ్ల పాటు రూ.457 కోట్లు ఈ సంస్థ వివిధ పార్టీలకు విరాళంగా అందజేసింది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాలు స్వీకరించకుండా, వీటిని రద్దు చేయాలంటూ సిపిఎం సుప్రీంకోర్టులో పోరాడిన సంగతి తెలిసిందే.

అభివాదం చేస్తున్న ప్రజాసంఘాలు, వామపక్షాల నాయకులు

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

- ఛార్జీల భారం రద్దు చేయాలి
- సదస్సులో వక్తల డిమాండ్
- భవిష్యత్ కార్యాచరణకు ప్రజా సంఘాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులకు డిస్కంలు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని ప్రజా సంఘాల ఐక్యవేదికలో వక్తలు డిమాండ్ చేశారు. వినియోగదారులపై మోపిన ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వ విధానాలనే చంద్రబాబు ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన అదాని స్మార్ట్ మీటర్లు వద్దు-ట్రూఅప్ ఛార్జీలు రద్దు అనే అంశంపై 'ప్రజా సదస్సు' విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం జరిగింది. సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, పిడబ్ల్యుఒ ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవానీ, ఐఎఫ్‌టియు నాయకులు కె పోలారి, పిడిఎస్‌యు నాయకులు రాజశేఖర్, కె సుబ్బారాయుడు, ఇతర ప్రజా సంఘాల నాయకులు ఖాదర్ బాషా, డి హరినాథ్, యు వీరబాబు ఈ సదస్సుకు అధ్యక్ష, వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జగన్ ప్రారంభించిన స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ చార్జీలతో పాటు సెకి ఒప్పందం, అదానికి భూముల అప్పగింత వంటి విధానాలను చంద్రబాబు కూడా కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిద్దరి ప్రభుత్వాలకు తేడా లేదని, ప్రధాని నరేంద్రమోడీ చేతిలో ఇద్దరు కీలుబొమ్మగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష పార్టీలు సమరశీల పోరాటం చేయడంతో మమతా బెనర్జీ ప్రభుత్వం బిగించకుండా వెనక్కి తగ్గిందన్నారు. చుట్టుపక్కల రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణలో స్మార్ట్ మీటర్లను బిగించలేదన్నారు. విద్యుత్ భారాల దెబ్బకు విజయనగరం, విశాఖపట్నంలో ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు మూతపడ్డాయని, గార్మెంట్ ఫ్యాక్టరీలు సంక్షోభంలో ఉన్నాయని తెలిపారు. ఉన్న స్వదేశీ పరిశ్రమలను మూతవేయిస్తూ, విదేశీ కంపెనీలు ద్వారా ఉపాధి పెంచుతామని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోందన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న జెన్‌కో నుంచి విద్యుత్ తీసుకోకుండా ప్రైవేట్ నుంచి అధిక ధరతో కొనుగోలు చేస్తూ ప్రజల నెత్తిన ఆ భారాలు మోపుతున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం హయాంలో ఆగస్టు 28న జరిగిన విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో మరలా మరో విద్యుత్ పోరాటం నడపాల్సిన పరిస్థితిని చంద్రబాబు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రజావేదిక ఇచ్చిన పిలుపును తమ పార్టీతో పాటు వామపక్షాలు కూడా మద్దతు తెలుపుతాయని వెల్లడించారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజలతో ఓట్లు వేయించుకున్న వైసిపి, టిడిపి ప్రభుత్వాలు భారాలు మిగతా5లో

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో గందరగోళం

- ఆప్షన్లలో ఒకలా, ప్రభుత్వ ఉత్తర్వుల్లో మరోలా ఫీజులు
- ఉత్తర్వులు రాకుండానే మొదలుపెట్టిన కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యాశాఖలో సమన్వయం లేదని మరోసారి రుజువైంది. దీంతో ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఇఎపిసెట్‌లో గందరగోళం నెలకొంది. ఉన్నత విద్యామండలి చేపట్టిన వెబ్‌కౌన్సెలింగ్ ఆప్షన్ల ఎంపికలో చూపించిన కళాశాలల ఫీజులు, రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన ఫీజులకు పొంతన లేదు. దీంతో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం గందరగోళం మధ్య ప్రారంభమవ్వడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఇఎపిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఈ నెల 4న ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఎఐసిటిఇ నుంచి అనుమతి వచ్చిన ఇంజినీరింగ్ కళాశాలల్లోని సీట్లకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలి. దీంతోపాటు 2025-26 విద్యాసంవత్సరానికి ఫీజులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే నిర్ధారించాల్సి ఉంది. ఈ రెండింటికీ ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన తరువాతే వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభించాలి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీట్ల అనుమతి, ఫీజుల నిర్ధారణ ఆదివారం

రాత్రి 7 గంటల వరకు రాలేదు. కానీ ఉన్నత విద్యామండలి మధ్యాహ్నమే వెబ్ ఆప్షన్ల ప్రక్రియను ప్రారంభించింది. దీని ప్రకారం కొంతమంది విద్యార్థులు ఆప్షన్లు కూడా ఎంచుకున్నారు. సీట్లకు, ఫీజులకు అనుమతినిస్తూ ప్రభుత్వం జిఓ 32ను సాయంత్రం 7 గంటలకు విడుదల చేసింది. కౌన్సెలింగ్‌లో కళాశాలలకు చూపించిన ఫీజులకు, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫీజులకు పొంతన లేకుండాపోయింది. చిత్తూరు జిల్లా మదనపల్లెలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు వెబ్‌సైట్‌లో రూ.43 వేలు చూపించగా, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో రూ.40 వేలుగా ఉంది. ఉదాహరణకు కనిగిరిలోని ఎబిఆర్‌కె కళాశాలకు వెబ్‌సైట్‌లో రూ.43 వేలు ఫీజు చూపించగా, జిఓ 32లో రూ.42,100గా ఉంది. దీంతో వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఫీజులను నిర్ధారించిన ఉత్తర్వుల్లో వెబ్ ఆప్షన్లలో లేని కళాశాలలను కూడా చూపించింది. విజయవాడలోని విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల నుంచి డీమ్డ్ యూనివర్సిటీగా మారింది. ఫీజుల ఉత్తర్వుల్లో ఉన్న ఈ కళాశాల పేరు వెబ్ ఆప్షన్లలో పొందుపరచలేదు. అదేవిధంగా గుంటూరులోని వివిఐటి కళాశాల ఇటీవల ప్రైవేట్ యూనివర్సిటీగా మారింది. ఫీజుల జిఓలో కళాశాలగా చూపించగా, కౌన్సెలింగ్‌లో యూనివర్సిటీగా ఉంది. ఉన్నత విద్యలో కళాశాల విద్య, ఉన్నత విద్యామండలి మధ్య సమన్వయం లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

7 కళాశాలలకు 1.05 లక్షల ఫీజు

రాష్ట్ర వ్యాప్తంగా 236 ఇంజినీరింగ్ కళాశాలల్లోని సీట్లు, వాటికి ఫీజులను నిర్ధారిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ విడివిడిగా ఉత్తర్వులు విడుదల చేశారు. గరిష్టంగా 7 కళాశాలలకు రూ.1.05 లక్షలు నిర్ధారించారు. విజయవాడలోని విఆర్ సిద్ధార్థ, పివిపి సిద్ధార్థ కళాశాలలకు, భీమవరంలోని శ్రీ విష్ణు, ఎస్‌ఆర్‌కెఆర్, విశాఖపట్నంలోని గాయత్రి విద్యాపరిషత్ రెండు కళాశాలలకు, గుంటూరులోని ఆర్‌విఆర్ అండ్ జెసి కళాశాలలకు గరిష్ట ఫీజును నిర్ధారించింది. ఎక్కువ కళాశాలలకు కనీస ఫీజు రూ.40 వేలు అమలు చేసింది. అదేవిధంగా ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రభుత్వ కోటాను నిర్ధారిస్తూ 131 జిఓను శశిధర్ విడుదల చేశారు.

అన్నమయ్య జిల్లాలో ఘోర ప్రమాదం

- మామిడి కాయల లారీ బోల్తా
- 9 మంది కార్మికులు మృతి
- పది మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- అన్నమయ్య జిల్లా

అన్నమయ్య జిల్లాలో కడప-రేణిగుంట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రైల్వేకోడూరు మార్కెట్‌కు మామిడి కాయల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో తొమ్మిది మంది కార్మికులు అక్కడికక్కడే మరణించారు. వీరిలో ఐదుగురు మహిళా కార్మికులు ఉన్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... రాజంపేట మండలం ఇసుకపల్లి గ్రామానికి చెందిన యానాది రెడ్డి తన మామిడి కాయలను లారీలో రైల్వే కోడూరుకు తరలిస్తున్నారు. లారీలో డ్రైవర్, మామిడి కాయలను కోసే 19 మంది కార్మికులు, ఇద్దరు చిన్న పిల్లలు మొత్తం 22 మంది ఉన్నారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువు కట్ట దగ్గర నందమూరి తారక రామారావు విగ్రహం ఎదురుగా ఈ లారీ బోల్తా పడింది. రోడ్డుమీద నుండి 20 అడుగుల దిగువకు పడిపోయింది. మామిడి కాయలలోడుపై కూర్చున్న మిగతా 2లో



బొబ్బిలి వీణ

'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' జాతీయ పురస్కారాలకు

రాష్ట్రం నుంచి 10 ఉత్పత్తులు ఎంపిక

- విజయనగరం నుంచి బొబ్బిలి వీణ ఎంపిక 2
- నేడు న్యూఢిల్లీలో ప్రదానం

బలవంతంగా 'నానో' ఎరువులు అమ్మొద్దు

- రైతుల ఆందోళనతో దిగొచ్చిన కేంద్రం
- రాష్ట్రాలకు లేఖ

5

4 కిలోమీటర్ల డోలీ మోత

- మార్గం మధ్యలోనే గర్భిణి ప్రసవం

ప్రజాశక్తి- రోలుగుంట (అనకాపల్లి)

'సంక్రాంతికి చుక్కల్లాంటి రోడ్లు' - గత ఏడాది నవంబర్‌లో సిఎం చంద్రబాబు చెప్పిన మాటలివి. ఆచరణలో ఆ మాటలు నీటిమూటలుగా మిగిలాయని చెప్పే ఘటనలు తరచూ సాక్షాత్కరిస్తున్నాయి. నాన్ షెడ్యూల్డ్ గ్రామాల్లోని వారికి నేటికీ డోలీ మోతలు తప్పడం లేదు. ఆదివారం నాలుగు కిలోమీటర్ల మేర ఓ గర్భిణిని డోలీలో మోస్తూ ఆస్పత్రికి తరలించారు. మార్గం మధ్యలోనే ఆమె ప్రసవించింది. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ కొండ శిఖర గ్రామమైన లోసింగికి చెందిన పాంగి సాయికి ఆదివారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. రోడ్డు సదుపాయం లేకపోవడంతో ఆమె భర్త సుందర్రావు, కుటుంబ సభ్యులు డోలీలోనే ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు పూనుకున్నారు. నాలుగు కిలోమీటర్ల మేర డోలీలో మోస్తూ వైబి.పట్నానికి తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే సాయి ప్రసవించింది. తదుపరి తల్లీ బిడ్డను అక్కడి నుంచి అంబులెన్స్‌లో బుచ్చయ్యపేట పిహెచ్‌సికి తరలించారు. వైబి.పట్నం నుంచి లోసంగికి బిటి రోడ్డు మంజూరైనా అది పూర్తి కాకపోవడంతో రోగులు, గర్భిణులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం

కాకపోవడంతోనే సాయిని డోలీలో తరలించాల్సి వచ్చిందని, రోడ్డు మార్గముంటే అంబులెన్స్ గ్రామానికి వచ్చేదని సాయి కుటుంబీకులు చెబుతున్నారు. గతంలో ఇదే మండలంలో డోలీలో తరలిస్తుండగా ఒక పాప, ఒక బాలుడు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. 'గిరి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం పదేపదే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో గత ఫిబ్రవరిలో అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సైతం కాలినడకన కొంతదూరం, వాహనాల్లో కొంతదూరం ప్రయాణించి గిరిజనుల కష్టాలను తెలుసుకున్నారు. రోడ్డు మంజూరు చేసినా దాన్ని పూర్తి చేయడంలో అధికార యంత్రాంగం వైఫల్యమైంది. దీంతో, డోలీ మోతలే శరణ్యమవుతున్నాయి' అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్!

న్యూఢిల్లీ : ప్రస్తుతం బీహార్‌లో నిర్వహిస్తున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)ను వచ్చే నెల నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. బీహార్‌లో ఎన్నికల ముందు ఆకస్మికంగా చేపట్టిన ఎస్‌ఐఆర్ వల్ల అనేకమంది ఓటు హక్కు కోల్పోతారంటూ దాఖలైన పిటిషన్లపై గత వారం సుప్రీంకోర్టు విచారించి మొట్టికాయ వేసిన సంగతి తెలిసిందే. ఈ విచారణ తరువాతే దేశవ్యాప్త ఎస్‌ఐఆర్‌పై తుదినిర్ణయం తీసుకుంటామని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఈ ఏడాది చివర్లో బీహార్‌లో, వచ్చే సంవత్సరం అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులు ఆయా రాష్ట్రాల్లో చివరిసారిగా ఎస్‌ఐఆర్ జరిగిన తర్వాత ప్రచురితమైన ఓటరు జాబితాలను బయటికి తీస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో 2008లో, ఉత్తరాఖండ్‌లో 2006లో చివరిసారిగా ఎస్‌ఐఆర్ నిర్వహించారు. బీహార్‌లో చివరిసారిగా 2003లో ఓటరు జాబితా సమగ్ర సవరణ జరిగింది. ఆ సమాచారం ఆధారంగానే ఇప్పుడు బీహార్‌లో ఎస్‌ఐఆర్ జరుగుతోంది.

ఉధృతంగా వశిష్ట గోదావరి

- కోడేరు పుష్కర ఘాట్ వద్ద మూడు అడుగులకు నీరు
- లంక గ్రామాలకు నిలిచిన రాకపోకలు

కొవ్వూరు గోష్పద క్షేత్రం వద్ద గోదావరి ఉధృతి

ప్రజాశక్తి- ఆచంట, యలమంచిలి, కొవ్వూరు

వశిష్ట గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. కోడేరు పుష్కర ఘాట్ వద్ద ఆదివారం సాయంత్రానికి మూడు అడుగులకు వరద నీరు చేరింది. వరద గంటగంటకూ పెరుగుతుండడంతో లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుత వారికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కోడేరు వద్ద కూడా క్రమక్రమంగా గోదావరి పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద నీరు నెమ్మది నెమ్మదిగా పల్లపు లంక ప్రాంతాల్లోకి చేరుతోంది. భీమలాపురం ఏటిగట్టు దిగువ ఉన్న నివాస ప్రాంతాల వారిని వరద ఏక్షణాన్నైనా చుట్టుముట్టే ప్రమాదం ఉండడంతో వారు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు లంక గ్రామాల నుంచి పడవలపై కొబ్బరి కాయలను సురక్షిత ప్రాంతాలకు, పశువులను ఏటిగట్టుకు తరలిస్తున్నారు. సోమవారం నాటికి గోదావరి మరింత పెరిగే అవకాశం ఉందని, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.కనకరాజు హెచ్చరికలు జారీ చేశారు. కోడేరు వద్ద ఇంజన్ పడవలను రెండింటిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

కనకాయలంక కాజ్‌వేపైకి చేరిన వరద నీరు

యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వేపైకి వరద నీరు చేరింది. వరద మరింత పెరిగితే కాజ్‌వేపై రాకపోకలకు ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ గ్రంధి పవన్‌కుమార్... కనకాయలంక, పెదలంక గ్రామాల్లో పర్యటించి వరద ప్రవాహాన్ని పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ వరద తీవ్రత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. కొవ్వూరు గోష్పద క్షేత్రం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద శనివారం 10.70 అడుగులు ఉన్న నీటిమట్టం ఆదివారానికి 10.90 అడుగులకు చేరుకుంది. 5,43,409 క్యూసెక్కులు ఉన్న వరద నీరు ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు 7,29,599 క్యూసెక్కులకు చేరుకుంది. సాయంత్రం ఆరు గంటలకు 6,14,762 క్యూసెక్కులు ఉంది. ఎగువన భద్రాచలంలో నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరం వద్ద కూడా క్రమంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే చర్యల్లో భాగంగా 4 నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమిస్తూ.. ఏపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదేశాలు జారీ చేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గానికి నరహరిశెట్టి నరసింహారావు, పెందుర్తి నియోజకవర్గానికి పిన్నిశెట్టి రాము, తిరువూరు నియోజకవర్గానికి పరసా రాజీవ్ రతన్, అనపర్తి నియోజకవర్గానికి సత్తి బుల్లిరెడ్డిని సమన్వయకర్తలుగా నియమించినట్లు ఆదివారం విడుదల చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై పోరాడాలని సమన్వయకర్తలకు సూచించారు.

స్పేస్ పాలసీ ప్రకటించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ (4.0)ను ప్రభుత్వం ప్రకటించింది. అంతరిక్ష ప్రాజెక్టుల విభాగంలో పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఈ పాలసీని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెట్టుబడిదారులకు సాయం అందించేందుకు ఎపి స్పేస్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించింది. ఈ మేరకు పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలసీలో రాష్ట్రంలో స్పేస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుకూల అంశాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో శ్రీ సత్యసాయి జిల్లాలో ఒక స్పేస్ సిటీని అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు తెలిపింది. ఇది అంతరిక్ష రంగంలో పరిశోధన, డిజైన్, ఆవిష్కరణ, నమూనాల తయారీకి కేంద్రంగా మారుతుందని పేర్కొంది. తిరుపతి జిల్లాలోని కాళహస్తి సమీపంలో స్పేస్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పింది. ఈ రంగంలో మైక్రో, స్మాల్, మీడియం ప్రాజెక్టులకు ఇచ్చే సబ్సిడీ వివరాలను పాలసీలో పేర్కొంది. విద్యుత్ సబ్సిడీ, 100 శాతం ఎస్‌జిఎస్‌టి, స్టాంపు డ్యూటీ మినహాయింపు, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ సబ్సిడీలు ఇవ్వనున్నట్లు పాలసీలో ప్రకటించింది. భూములు కేటాయించడం, ఇన్‌టివ్‌లను ఇవ్వనున్నట్లు తెలిపింది.

అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం తీసుకుని వస్తున్న సిఎం రేవంత్, మంత్రి సురేఖ

వైభవంగా తెలంగాణ లష్కర్ బోనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లష్కర్ బోనమెత్తింది. ఆదివారం సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. సికింద్రాబాద్ ప్రాంత ప్రజలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది యాత్రికులు తరలివచ్చారు. మహిళల బోనాలు, కోలాటాలు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, యువతీ యువకుల నృత్యాలు, కోలాహలాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి సిఎం రేవంత్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సాధారణ యాత్రికులకు మూడు క్యూలైన్లు, బోనాల సమర్పించే మహిళలకు రెండు క్యూలైన్లు, విఐపిలకు ఒక క్యూలైన్ ఏర్పాటు చేశారు. బోనాల సందర్భంగా సికింద్రాబాద్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

అన్నమయ్య జిల్లాలో ఘోరప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

కార్మికులంతా లారీ కింద ఇరుక్కుపోయారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు అక్కడికక్కడే మరణించారు. వారిలో గజ్జల దుర్గయ్య, సుబ్బా రత్నమ్మ, గజ్జల వెంకటేష్, గజ్జల శీను, చిట్టెమ్మ, గజ్జల లక్ష్మీదేవి, రాధా, గజ్జల రమణ, వెంకటసుబ్బమ్మ ఉన్నారు. సంఘటనా స్థలానికి రాజంపేట ఎఎస్‌పి మనోజ్‌రామ్‌నాథ్ సెగ, ఓబులవారిపల్లె, పుల్లంపేట, కోడూరు ఎస్‌ఐలు మహేష్ నాయుడు, శివకుమార్, లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, తన సిబ్బందితో చేరుకొని లారీ కింద ఇరుక్కుపోయిన పదిమందిని అతి కష్టమ్మీద బయటకు తీశారు. వారిని రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో, వారిని వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. ఇద్దరు పిల్లలూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదం తర్వాత జాతీయ రహదారిపై సుమారు రెండు గంటలసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మృతులు, బాధితులు సెట్టిగుంట ఎస్‌టి కాలనీకి చెందినవారే. ఈ ప్రమాదం పట్ల రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధనరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

సానుభూతి మాటలొద్దు... నిర్దిష్ట హామీలివ్వండి : ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె బాటపట్టారు. జిఒ నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టిన పరిష్కారం లభించకపోవడంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి సమ్మెలోకి వెళ్లారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన ఆందోళనకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి (సిఐటియు) కె. ఉమామహేశ్వరరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలోని 50 మున్సిపాలిటీలలో ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం తెల్లవారుజాము నుంచి సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. ప్రజారోగ్యం, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిఒ నం.36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెను నిర్వీర్యం చేసేందుకు అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, బెదిరింపులు మానుకోకపోతే కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని పోరాటం చేస్తామని హెచ్చరించారు. సానుభూతి మాటలు కాకుండా నిర్దిష్టమైన హామీలతో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పల్నాడు జిల్లా నరసరావుపేట సమ్మె శిబిరంలో పాల్గొన్న ఉమామహేశ్వరరావు

మంగళగిరిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాటపట్టారు. నెల్లూరు నగరపాలక సంస్థ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గాంధీబొమ్మ సెంటర్ నుంచి విఆర్‌సి వరకు ర్యాలీ నిర్వహించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం నుండి సంజీవ నగర్ గేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే పాలన స్తంభింపచేస్తామని కార్మికులు హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో నిరసన తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు నెలకు రూ.30వేలకు వేతనం చెల్లించాలని నినాదాలు చేశారు. అనంతపురం జిల్లాకేంద్రంతో పాటు రాయదుర్గం, తాడిపత్రి, శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో రిలేదీక్షలు, నిరసన దీక్షలు నిర్వహించారు. ఒంగోలు నగర కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న వర్కర్స్ స్థానిక వాటర్ ఫిల్టర్ బెల్ట్ ట్యాంక్ వద్ద నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వాటర్ లైన్‌మాన్, పార్కులు, బోరింగ్ రిపేర్, మొక్కల సంరక్షణ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఆందోళన చేపట్టారు. మార్కాపురం, బాపట్ల మండలాల్లోనూ కార్మికులు సమ్మె చేపట్టారు.

విజయవాడలో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు

- ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. విజయవాడ 21వ డివిజన్‌లో చేపట్టిన ఆందోళననుద్దేశించి సిపిఎం రాష్ట్ర కమిటీసభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ... గత వైసిపి ప్రభుత్వం బాటలో టిడిపి కూటమి ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. కరెంట్ ఛార్జీలు, భారాలు, స్మార్ట్ మీటర్ల విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా సంవత్సర కాలంలో ప్రజలపై రూ.14,487 కోట్ల అదనపు భారం విద్యుత్ ఛార్జీల పేరుతో మోపిందన్నారు. కబేళా విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్లతో నిరసన చేపట్టారు. ప్రజల నుంచి స్వీకరించిన అభ్యంతర పత్రాలను విద్యుత్ కార్యాలయంలో అందజేశారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండలంలోని వెంకటాపురం గ్రామంలో భారీగా విద్యుత్ బిల్లులు వచ్చిన వ్యవసాయ మీటర్లను రైతులతో కలిసి సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పరిశీలించారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల రైతులకు రూ. 20 వేలు నుంచి రూ.22 వేల విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గి స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించొద్దని, కరెంట్ ఛార్జీలు తగ్గించాలని నినదిస్తూ రాంబిల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ మధురవాడ పరిధి ముత్యాలమ్మ కాలనీ, వివేకానందనగర్‌ల్లో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. జివిఎంసి 97వ వార్డు పరిధి కామాక్షమ్మ నగర్, కుమ్మరి కాలనీ, గాంధీనగర్, వికలాంగుల కాలనీ, రైల్వే కాలనీ, ఉడా కాలనీలో పాదయాత్ర చేపట్టారు. 56వ వార్డు పరిధి గోకుల్‌నగర్, దుర్గానగర్, యాతపేట, తోటవీధిలోనూ, 32వ వార్డులోని పలు కాలనీల్లోనూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఇంటింటికీ పోస్టర్లను అతికించారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్ల పనులకు రూ.524 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసుల (ఐఎఎస్) అధికారుల నివాసాల కోసం 18 టవర్లలో ఇంకనూ చేపట్టాల్సిన పనుల కోసం రూ.524.70 కోట్లు మొత్తానికి పరిపాలనా అనుమతి ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 12 అంతస్తుల భవనంలో 432 అపార్ట్‌మెంట్ యూనిట్లతో కూడిన బహుళ అంతస్తుల క్వార్టర్స్‌లో ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్, విద్యుత్, ప్లంబింగ్, శానిటరీ ఫిక్చర్‌లు, అగ్నిమాపక నిబంధనల అంశాలు లిఫ్ట్‌లు, భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. సిఆర్‌డిఎ ఈ పనులను చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో సూచించారు.

7 సంస్థలకు 32.4 ఎకరాలు

రాజధానిలో 7 సంస్థలకు 32.4 ఎకరాల భూ కేటాయింపులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. భూ కేటాయింపుల్లో 60 ఏళ్లపాటు లీజుకు ఇవ్వనుండగా, కేంద్ర ప్రభుత్వ ఆదాయపు పన్నులశాఖకు 2 ఎకరాలు, ఎపి గ్రామీణ బ్యాంక్‌కు 2 ఎకరాలు, సెంట్రల్ బ్యాంక్‌కు 40 సెంట్లు, ఎస్‌ఐబికు 50 సెంట్లు, ఇమిగ్రేషన్ బ్యూరోకు 50 సెంట్లు, కిమ్స్ మెడికల్ కళాశాలకు 25 ఎకరాలు, బిజెపి కార్యాలయానికి 2 ఎకరాలు (33 మూడేళ్ల లీజుకు) ఇచ్చారు. గతంలో భూములిచ్చిన గెయిల్, అంబికా సంస్థలకు కేటాయింపులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే 2014-19 మధ్య 6 సంస్థలకు 34.59 ఎకరాలు భూములు కేటాయించగా, ఆ కేటాయింపులను పునఃసమీక్షించి 33.49 ఎకరాలు మాత్రమే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు మోటూరి పూర్ణచందర్‌రావు మృతి

- పలువురు సంతాపం
- బుధవారం అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం సీనియర్ నాయకులు మోటూరి పూర్ణచందర్‌రావు (81) గుండెపోటుతో ఆదివారం మరణించారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లో తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా వెలిగటూరు గ్రామంలో 1944లో ఆయన జన్మించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో వివిధ బాధ్యతల్లో ఆయన పనిచేశారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఎంటిలో పనిచేస్తూ నగర మార్క్సిస్టు పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన మృతి పట్ల సిపిఎం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కమిటీలు సంతాపాన్ని ప్రకటించాయి. సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఐద్వా జాతీయ నాయకులు ఎస్ పుణ్యవతి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి సంతాపాన్ని ప్రకటించారు. పూర్ణచందర్‌రావు అంత్యక్రియలు బుధవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కార్మిక సంఘంలో కీలక పాత్ర

పూర్ణచందర్‌రావు ఉమ్మడి పార్టీతోనూ, అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టుతోనూ పూర్తి సంబంధం కలిగి ఉన్నారు. 1968 నుంచి హైదరాబాద్ నగర పార్టీ ఉద్యమ నిర్మాణంలో ఎన్‌వి భాస్కర్‌రావు, లక్ష్మీ దాస్, స్వామిలతోపాటు కృషి చేశారు. ఆ తరువాత ఏర్పడిన కన్వీనింగ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శిగా 1970 నుంచి ఒక దశాబ్ద కాలంపాటు పనిచేశారు. 1978లో జరిగిన పార్టీ ఉమ్మడి రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. తిరిగి 1981లో కూడా రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1966లో ఆయన హెచ్‌ఎంటిలో ట్రైనీగా చేరారు .అనేక ఆటుపోట్లతో హెచ్‌ఎంటి సంస్థలో పోరాటాలు చేసి సుదీర్ఘ కాలం యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికవ్వడమే కాక, ఆనాడు ఉన్న ఇతర ప్రభుత్వ రంగ పరిశ్రమలలో నాయకత్వం అభివృద్ధి కావడానికి ఎంతో కృషి చేశారు.

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలిరూరల్ (గుంటూరు జిల్లా)

నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న సిఐ ఉమేష్

గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను గుంటూరు జిల్లా తెనాలి తాలుకా పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం టిడ్కో గృహాల సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో కఠెవరం గ్రామానికి చెందిన ముక్కాల ప్రకాశరావు, పెదరావురు చెందిన దర్శి ప్రదీప్, చినపరిమి ప్రాంతానికి చెందిన నలిగల శివ నాగరాజు, తెనాలి రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన మెరుగుమాల ప్రశాంత్ కిరణ్‌లపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు సిఐ ఉమేష్ తెలిపారు.

15, 16 తేదీల్లో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమల శ్రీవారి ఆణిమాసం చివరన ఆణివార ఆస్థానం పురస్కరించుకుని ఈ నెల 15, 16 తేదీల్లో విఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. 15న మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 16న బుధవారం ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ రెండు ప్రత్యేక రోజుల్లో ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. ఇదే సమయంలో 14, 15 తేదీల్లోనూ రెండు రోజులపాటు విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సు లేఖలు తీసుకురావద్దని యాత్రికులకు టిటిడి విజ్ఞప్తి చేసింది.

'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' జాతీయ పురస్కారాలకు

రాష్ట్రం నుంచి 10 ఉత్పత్తులు ఎంపిక

- నేడు న్యూఢిల్లీలో ప్రదానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒక్కో జిల్లాకు ఒక్కో ఉత్పత్తి చొప్పున ఎంపిక చేసి ఆయా ఉత్పత్తులకు గుర్తింపు తీసుకురావడానికి ఉద్దేశించిన 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి (ఒడి ఒపి)' జాతీయ పురస్కారాలకు రాష్ట్రం నుంచి 10 ఉత్పత్తులు ఎంపికయ్యాయి. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఒక ప్రకటన విడుదల చేశారు. వీటిలో ఏడు చేనేత, హస్త కళా ఉత్పత్తులుండగా..రెండు వ్యవసాయోత్పత్తులున్నట్లు ఆయన తెలిపారు. ఈ పురస్కారాలను న్యూఢిల్లీలో భారత్ మండపంలో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సోమవారం అధికారికంగా ప్రకటించి, ప్రదానం చేస్తారని తెలిపారు. పురస్కారాలు పొందిన ఉత్పత్తులు ఇవే : చేనేత, హస్తకళా ఉత్పత్తుల్లో విజయనగరం జిల్లా బొబ్బిలి వీణ, అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక బొమ్మలు, కాకినాడ జిల్లా పెద్దాపురం చీరలు, బాపట్ల జిల్లా చీరాల చీరలు, తిరుపతి జిల్లా వెంకటగిరి చీరలు, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి అల్లికలు, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టు చీరలు ఉన్నాయని, వ్యవసాయ విభాగం నుంచి గుంటూరు జిల్లా మిర్చి, శ్రీకాకుళం జిల్లా జీడిపప్పు ఉన్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో జరిగిన పోటీలో రాష్ట్రానికి దక్కిన మరో పురస్కారాన్ని సోమవారం ప్రకటించనున్నారని చెప్పారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, కళాకారులు ఇప్పటికే న్యూఢిల్లీకి చేరుకున్నారని తెలిపారు. ఇప్పటికే కడప అరటి, చిత్తూరు టమాటో, అనంతపురం వేరుశెనగ వంటి ఉత్పత్తులను ఎంపిక కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

వీణల తయారీలో నిమగ్నమైన కార్మికులు

300 కుటుంబాలకు బొబ్బిలి వీణే జీవనోపాధి

జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన బొబ్బిలి వీణకు ఎంతో విశిష్టత ఉంది. 'బొబ్బిలి వీణ' అని విస్తృతంగా పిలవబడే ఈ సంప్రదాయ 'సరస్వతి వీణ' విలక్షణమైన స్వరాలకు ప్రసిద్ధి చెందింది. ఈ వీణను పోలి ఉండే చిన్నపాటి వీణను బహుమతిగా, జ్ఞాపికగా ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది. బొబ్బిలి పట్టణానికి సమీపంలోని గొల్లపల్లి గ్రామం.. వీణల తయారీకి పెట్టింది పేరు. వీటి తయారీ అరుదైన హస్తకళగా గుర్తింపు పొందింది. దాదాపు 300 కుటుంబాలు గత వందేళ్లకు పైగానే వీణల తయారీనే జీవనోపాధిగా కొనసాగిస్తున్నారు. బాడంగి మండలం వాడాడలోనూ ప్రస్తుతం వీణలు తయారవుతున్నా.. వాటినీ బొబ్బిలి వీణలుగానే పరిగణిస్తున్నారు. వీణల తయారీకి పనస, సంపంగి కలపను ఉపయోగిస్తారు. అయితే ఇటీవల ఈ కలపకు కొరత ఏర్పడింది. దీంతో కలప కొరతను నివారించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తృతంగా పనస చెట్లను పెంచాలని ప్రభుత్వం ఇటీవలే నిర్ణయించింది. బొబ్బిలి వీణకు ఇదివరకే భౌగోళిక గుర్తింపు కూడా లభించిన సంగతి విదితమే.

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

ఖరీదు'తో సినీరంగంలోకి కోట శ్రీనివాసరావు అడుగుపెట్టారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించారు. 750కిపైగా చిత్రాల్లో నటించారు. కోట కుమారుడు కోట ప్రసాద్ 2010 జూన్ 21న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

బాధాకరం : ప్రధాని మోడీ

కోట శ్రీనివాసరావు మృతి బాధాకరమని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. 'ఆయన సినీ ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞ గుర్తుండిపోతాయి. తరతరాలుగా ప్రేక్షకులను తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

చంద్రబాబు నివాళి

జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఉంచిన కోట శ్రీనివాసరావు భౌతికకాయానికి పూలమాల వేసి ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోట భౌతికకాయాన్ని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ప్రముఖ సినీనటుడు చిరంజీవి తదితరులు సందర్శించి నివాళు లర్పించారు.

ఏ పాత్రయినా చేయగలడు : చిరంజీవి

'లెజెండరీ యాక్టర్, బహుముఖ ప్రజ్ఞాశాలి కోట శ్రీనివాసరావు ఇక లేరనే వార్త ఎంతో కలచివేసింది. 'ప్రాణం ఖరీదు'తో ఆయన నేనూ ఒకేసారి సినిమా కెరీర్ ప్రారంభించాం. ఆ తర్వాత వందల కొద్దీ సినిమాల్లో ఎన్నెన్నో విభిన్నమైన పాత్రల్లో నటించి, ప్రతి పాత్రనీ తన విలక్షణ, ప్రత్యేక శైలితో అలరించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయారు. కామెడీ, విలన్, సపోర్టింగ్ క్యారక్టర్ ఇలా ఏ పాత్ర అయినా తాను మాత్రమే చేయగలడన్న గొప్పగా నటించారు. కోట శ్రీనివాసరావులాంటి నటుడు లేనిలోటు చిత్ర పరిశ్రమకి, సినీ ప్రేమికులకు ఎన్నటికీ తీరనిది' అని పేర్కొన్నారు.

సినీ, రాజకీయ ప్రముఖుల సంతాపం

కోట శ్రీనివాసరావు మృతి పట్ల తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మాజీ సిఎం, భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు కెసిఆర్, సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎపి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల, ఎపి మంత్రులు కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, వై.సత్యకుమార్, బిసి జనార్ధన్‌రెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మంగరాజు, ఎస్.అనిల్‌కుమార్, తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

kotak

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : 27 బికెసి, సి 27, జి బ్లాక్, బాంద్ర కుర్ల కాంప్లెక్స్, బాంద్ర (ఈ), ముంబయి-400051
కార్పొరేట్ కార్యాలయం : కొటక్ ఇన్ఫినిటి, బిల్డింగ్ నెం.21, ఇన్ఫినిటి పార్క్, జనరల్ ఏ.కే వైద్య మార్గ్, మలాడ్ (ఈ), ముంబాయి-400097 www.kotak.com

వేలం-నోటీసు

క్రింద పేర్కొన్న ప్రకారం, దిగువ తెలిపిన రుణగ్రహీత/లు బంగారు ఆభరణాలు/వస్తువులను సెక్యూరిటీగా పెట్టి బంగారు రుణ సదుపాయం పొంది ఉన్నారు. బాకీ మొత్తాలు మరియు వాయిదాలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత/లు విఫలమైనారు మరియు బాకీ మొత్తాలు తిరిగి చెల్లించుటకు రుణగ్రహీతలను పిలుస్తూ నోటీసులను జారీ చేయడమైనది. అయినప్పటికి, రుణగ్రహీత/లు బాకీ మొత్తాలను తిరిగి చెల్లించుట/క్లియర్ చేసుకోవడంలో విఫలమైనందున బ్యాంకు పేరునా తాకట్టుగా ఉన్న బంగారు ఆభరణాలను బ్యాంకు స్వాధీనపరుచుకొని వేలం వేస్తుంది.

దిగువ పేర్కొన్న బంగారు ఆభరణాల వేలం తేదీ/తర్వాత ఇక్కడ నిర్వహించబడుతుంది:-
తేది : 24-జులై -2025, సమయం: ఉ.11.00 గం.లకు, ప్రదేశం: సంబంధిత శాఖ ఆవరణలు

ఎపిపిఎల్ఎపిఎసి	కక్షిదారుని పేరు	రాష్ట్రం	ఉప ప్రదేశం	శాఖ పేరు	స్థూల బరువు	వేలం తేది
GLN3844390	భార్గవ్ భీమవరపు	ఎపి	విజయవాడ	ఎమ్‌జి రోడ్డు	977.2	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3874399	పోలవరపు వెంకటేశ్వరరావు	ఎపి	విజయవాడ	సత్యనారాయణ పురం	435.8	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3451880	ఎమ్ కె కాంతి మాతి	ఎపి	విజయవాడ	రామచంద్రాపురం	454.7	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3811351	చిల్ల సునీత	ఎపి	విజయవాడ	సీతమ్మధార	266.8	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3816785	షేక్ నసీమ బేగం	ఎపి	విజయవాడ	లబ్బీపేట	132.2	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3841046	గొంప లక్ష్మి	ఎపి	విజయవాడ	సీతమ్మధార	134.81	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3607581	దట్ల శ్రీదేవి	ఎపి	విజయవాడ	సత్యనారాయణపురం	153.8	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3773539	రాచర్ల సిద్ధార్థ	ఎపి	విజయవాడ	రామచంద్రాపురం	127.1	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3625643	పురమనేని జ్ఞానేంద్ర కుమార్	ఎపి	విజయవాడ	విజయనగరం	110.5	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3783903	ఎమ్.గంగులప్ప	ఎపి	విజయవాడ	ఆదోని	101.1	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3685225	లక్ష్మీరెడ్డి	ఎపి	విజయవాడ	మార్కాపురం	105.1	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3683710	మనుపటి సురేష్ బాబు	ఎపి	విజయవాడ	నందిగామ	107.1	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3785291	ఉప్పుతల బలరాం	ఎపి	విజయవాడ	లబ్బీపేట	88.2	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3614601	రేపాక సత్యనారాయణ శరన్	ఎపి	విజయవాడ	కాకినాడ	99.9	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3817169	మద్దిపాటి రాజేష్	ఎపి	విజయవాడ	గాయత్రీ నగర్	83.7	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3434240	చిట్టూరి రామసుందరి	ఎపి	విజయవాడ	కాకినాడ 1	101.7	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3863882	లింగుట్ల త్రివిక్రం రావు	ఎపి	విజయవాడ	మెయిన్ రోడ్డు	75	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3767298	ఇమ్రాన్ ఖాన్	ఎపి	విజయవాడ	కర్నూలు	76.9	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3858942	గోసరుపల్లి మహబూబి	ఎపి	విజయవాడ	రామచంద్రాపురం	72.6	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3741635	సలాది సుందరనారాయణ	ఎపి	విజయవాడ	భీమవరం	80.7	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3858938	గోసరుపల్లి మహబూబి	ఎపి	విజయవాడ	రామచంద్రాపురం	64.4	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3814707	షేక్ షాహీన్	ఎపి	విజయవాడ	లబ్బీపేట	54.6	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3773244	దూదేకుల మస్తాన్ బీ	ఎపి	విజయవాడ	మార్కాపురం	53.2	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3574955	షేక్ మజీద్	ఎపి	విజయవాడ	కడప	48.4	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3876183	లింగుట్ల త్రివిక్రం రావు	ఎపి	విజయవాడ	మెయిన్ రోడ్డు	39.5	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3844459	పెదవల్లి అనంత కోటేశ్వరరావు	ఎపి	విజయవాడ	నరసరావుపేట	41	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3433308	షేక్ మస్తాన్‌వలి	ఎపి	విజయవాడ	నరసరావుపేట	46.4	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3750810	వల్లిపి ఆంజనేయులు	ఎపి	విజయవాడ	రామచంద్రాపురం	42	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3539365	సన్నాల మహేశ్వర్ రెడ్డి	ఎపి	విజయవాడ	నరసరావుపేట	45.8	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3743700	ఇసుకల సుప్రియ	ఎపి	విజయవాడ	గిద్దలూరు	38.2	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3832247	తోట వెంకటేష్	ఎపి	విజయవాడ	లలితానగర్	35.3	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3420784	పుల్లా అరుణ్ కుమార్	ఎపి	విజయవాడ	వెంకోజిపాలెం	52.3	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3860224	రొద్దం చంద్రకాంత్ రెడ్డి	ఎపి	విజయవాడ	కదిరి	32.2	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3872310	బావిరెడ్డి రాంబాబు	ఎపి	విజయవాడ	వాల్టేర్	23.5	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3841012	పకనటి ఏసురాజు	ఎపి	విజయవాడ	తాడేపల్లిగూడెం	23.8	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3841027	పకనటి ఏసురాజు	ఎపి	విజయవాడ	తాడేపల్లిగూడెం	23.45	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3632870	గౌడీపెరు ప్రసన్న కుమార్	ఎపి	విజయవాడ	సత్యనారాయణపురం	24.3	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3598322	ఎల్లుపు వెంకట అప్పల హరినాథ	ఎపి	విజయవాడ	గాజువాక	23.4	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3508385	కోట హేమలత	ఎపి	విజయవాడ	ఎమ్‌జి రోడ్డు	20.4	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3612170	చల్లా మాధురి	ఎపి	విజయవాడ	లబ్బీపేట	20.7	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3856844	గాజుల సుధాకర్	ఎపి	విజయవాడ	ఆదోని	18.4	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3825270	ఎస్.మహబూబ్ బాష	ఎపి	విజయవాడ	కదిరి	17.3	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3571653	బోయ తిమ్మరాజు	ఎపి	విజయవాడ	ఆదోని	18.5	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3746870	రామముని శ్రీకాంత్	ఎపి	విజయవాడ	వెంకోజీపాలెం	16.6	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3251596	కోడె వీరాస్వామి	ఎపి	విజయవాడ	తాడేపల్లిగూడెం	19.2	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3785441	ఎస్.సమీన	ఎపి	విజయవాడ	తిరుపతి	15.4	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3613446	పొదిలి రాకేష్	ఎపి	విజయవాడ	అరండల్‌పేట	14.4	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3691750	దులి గంగరాజు	ఎపి	విజయవాడ	అనకాపల్లి	11.7	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3828718	అమరవరపు కృష్ణవేణి	ఎపి	విజయవాడ	ఆరండల్‌పేట	10.1	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3360983	సుబ్రమణ్యం వి.	ఎపి	విజయవాడ	పెనుకొండ	11.9	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3553370	గువ్వల శ్రీనివాసులు	ఎపి	విజయవాడ	కర్నూలు	10	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3623453	మునుపాటి సురేష్	ఎపి	విజయవాడ	రావులపాలెం	8.2	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3575570	దూలి గంగరాజు	ఎపి	విజయవాడ	అనకాపల్లి	7.8	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3641495	ఇందూరి రుక్మిణి కృష్ణ	ఎపి	విజయవాడ	కాకినాడ 1	6.8	తేది 24 జులై 2025 న / తర్వాత
GLN3254416	పోతుల బాల కశమ్మ	ఎపి	విజయవాడ	గిద్దలూరు	9.2	తేది 24 జులై 2025 న / తర్వాత

వేలం తేదిన రెండు ప్రస్తుత ఫోటోగ్రాఫ్‌లతో పాటు వెరిఫికేషన్ కొరకు ఓరిజినల్‌తో పాటు సంతకం మరియు చిరునామా గల వారి ఫోటో-ఐడెంటిటీ కాపీని సమర్పించగలరని బిడ్డర్లను అభ్యర్థించడమైనది. బిడ్డర్లకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా వేలం ను రద్దు లేదా వేలం యొక్క ప్రదేశం/తేది/సమయం మార్చే హక్కు బ్యాంకుకు కలదు.
వేలం ప్రక్రియకు అయ్యే ఖర్చు ఖాతాదారు ఖాతాకు డెబిట్ అవుతుంది. బిడ్ మొత్తం ఖాతా మొత్తం చెల్లించుటలో తక్కువైనట్లయితే ఖాతాదారుని నుండి మిగిలిన మొత్తంను వసూలు చేసే హక్కు బ్యాంకుకు కలదు.
వేలం యొక్క నియమాలు మరియు నిబంధనల సంబంధించి ఏవైనా పూర్తి వివరాల కొరకు, మీరు అవసరమైతే దిగువ తెలిపిన వ్యక్తి/లను సంప్రదించగలరు.

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్.
ఫోన్- 9110330228

వినుత దంపతులను చెన్నైకు తరలిస్తున్న పోలీసులు

వినుత దంపతులకు రిమాండ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

కారు డ్రైవర్ రాయుడు హత్యకేసులో నిందితులుగా ఉన్న జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత, ఆమె భర్త చంద్రబాబు, మరో ముగ్గురు నిందితులు ప్రస్తుతం చెన్నై పులాల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. శనివారం రాత్రి వినుత దంపతులతో పాటు ముగ్గురు నిందితులను తమిళనాడు పోలీసులు అదుపులోకి తీసుకుని చెన్నై తరలించారు. వారిని ఎగ్మోర్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. రాయుడు మృతదేహం ఆయన స్వగ్రామమైన శ్రీకాళహస్తి రూరల్ మండలం బొక్కిసంపాలెం గ్రామానికి ఆదివారం చేరుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాయంకాలం అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె సోదరి రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

ఉమ్మడి విశాఖలో భారీ వర్షం

- విశాఖలో కొద్ది దూరం కొట్టుకుపోయిన బైకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, సీలేరు యంత్రాంగం

విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని పలుచోట్ల ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పిడుగులు పడ్డాయి. విశాఖ నగరంలోని ఎంవిపి.కాలనీ, పెద వాల్తేరు, చిన వాల్తేరు, మద్దిలపాలెం, చైతన్య నగర్, సీతమ్మధార, హెచ్‌బి కాలనీ, కెఆర్‌ఎం కాలనీ ప్రాంతాలు జలమయమయ్యాయి. వ్యర్థాలు, చెత్తా చెదారంతో కూడిన మురుగునీరు ఇళ్లలోకి చేరింది. కెఆర్‌ఎం కాలనీలో ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీటికి రెండు బైకులు కొట్టుకుపోతుండగా వాటిని పట్టుకోవడానికి స్థానికులు పరుగులు తీశారు. ఈ ప్రాంతంలోని కార్లు, బైకులు నీట మునిగాయి. జ్ఞానాపురం ఎర్రిగడ్డ ప్రాంత పరిసరాల్లోని ఇళ్లలోకి మురుగునీరు చేరింది. అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గెడ్డలు, కాలువల్లో పూడిక తీయకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్టు పలువురు తెలిపారు. కూర్మన్నపాలెం, గాజువాక ప్రాంతాల్లో మధ్యాహ్నం జోరువాన కురిసింది. అల్లూరి జిల్లా జికె వీధి,

విశాఖలోని కెఆర్‌ఎం కాలనీలో కొట్టుకుపోతున్న బైకులను పట్టుకోడానికి ప్రయత్నిస్తున్న స్థానికులు

పెదబయలు, జి మాడుగుల మండలాల్లో భారీ వర్షం కురిసింది. సీలేరు వారపు సంతకు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. పెదబయలు మండలంలో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది.

కెరటాల తాకిడికి ధ్వంసం అవుతున్న ఇళ్లు

ఉప్పాడ సముద్రం ఉగ్రరూపం

- నేలమట్టమవుతున్న మత్స్యకారుల గృహాలు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ సముద్రతీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో, మత్స్యకారుల గృహాలు కోతకు గురవుతున్నాయి. ప్రస్తుతం ఎటువంటి అల్పపీడనాలూ, తుపాను హెచ్చరికలూ లేకపోయినప్పటికీ సముద్రం ఉగ్రరూపం చూపిస్తోంది. ఆదివారం ఉదయం నాలుగు గంటల నుంచి కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ పంచాయతీ సూరాడపేట, మాయాపట్నం పాత బజారు సమీపంలో సముద్రం ముందుకు రావడంతో మత్స్యకారుల ఇళ్లపై అలలు విరుచుకుపడి ఎనిమిది ఇళ్లు ధ్వంసమయ్యాయి. తీర ప్రాంతంలోని సిమెంట్ రోడ్డు అలల తాకిడికి సాగర గర్భంలో కలిసిపోయింది.

కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డును అలలు తాకుతున్నాయి. కొన్నిచోట్ల బీచ్ రోడ్డు ధ్వంసమైంది. సుబ్బంపేట సమీపంలో మత్స్యకార మహిళలు ఎండబెట్టుకున్న చేపలపై కెరటాలు ఎగిసి పడడంతో అవి తడిసిపోయాయి. ఉప్పాడ పంచాయతీ రంగంపేట నుంచి ఎస్‌పిజిఎల్ చివరి వరకు అలల ఉధృతి తీవ్రస్థాయిలో ఉంది. సముద్రం ఉగ్రరూపం చూపించి తమ ఇళ్లు సముద్రంలో కలిసిపోతున్నా తమవైపు అధికారులు, నాయకులు కన్నెత్తి చూడలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధ్వంసమైన జియో ట్యూబ్

అధికారుల నిర్వహణ లోపంతో జియో ట్యూబ్ క్రమేణా ధ్వంసమైంది. మత్స్యకారుల గృహాలను కాపాడాలనే లక్ష్యంతో 2006లో ఏర్పాటు చేసిన జియో ట్యూబ్ సముద్ర గర్భంలో కలిసిపోయింది. జియో ట్యూబ్ ఉన్నంతవరకు ఉప్పాడ గ్రామాన్ని కోత నుంచి కాపాడింది. ప్రస్తుతం జియో ట్యూబ్ ధ్వంసం కావడంతో కోతను నివారించలేక ఉప్పాడ గ్రామం క్రమేపీ సముద్ర గర్భంలో కలిసిపోతోందని మత్స్యకారులు వాపోతున్నారు. తమ గ్రామాన్ని సముద్రపు కోత, అలల తాకిడి నుంచి కాపాడాలని, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు కోరుతున్నారు.

విశిష్ట తెలుగు దిగ్దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేష్, ముక్తేశ్వర్‌రావు తదితరులు

తెలుగు భాష పరిరక్షణకు నడుం బిగించాలి

- పాలకులు స్పందించే వరకు నిరంతర కార్యక్రమాలు
- ఎపి రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు తీర్మానం

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

తెలుగుభాష పరిరక్షణకు నడుంబిగించాలని , పాలకులు స్పందించే వరకు నిరంతర కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు తీర్మానించింది. తెలుగు భాషా పరిరక్షణ సదస్సు కర్నూలు టిజివి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. తూమాటి సంజీవరావు రచించిన 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం' పుస్తకాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి.వెంకటేష్, విశ్రాంత ఐఎఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సదస్సులో 26 జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు చర్చించి 12 తీర్మానాలను ఆమోదించారు. అవి 'ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ప్రతి ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలో తెలుగులోనే బోధన జరగాలి. పదవ తరగతి వరకు తెలుగు కచ్చితంగా రెండు పిరియడ్లు బోధించాలి. ఇంటర్మీడియట్‌లో తప్పనిసరిగా తెలుగు ప్రధాన అంశంగా ఉండాలి. డిగ్రీ, పీజీ, సాంకేతిక విద్యలో కూడా తెలుగు ఒక అంశంగా బోధించాలి. ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు, వినతి పత్రాలు, జారీ చేసే ఉత్తర్వులు తెలుగులోనే ఉండాలి. పొరుగు రాష్ట్రాల మాదిరి తెలుగు భాషను ఉద్ధరించుకోవాలి. ఉత్తీర్ణత తరువాత ఇచ్చే సర్టిఫికెట్లు తెలుగు, ఆంగ్లంలో ఉండాలి' అని తీర్మానించారు. ఈ సదస్సులో అధ్యక్షులు కురాడి చంద్రశేఖర్ కల్కూర, సంచాలకులుగా పత్తి ఓబులయ్య , ఉపాధ్యక్షులు జెఎస్‌ఆర్‌కె శర్మ, కార్యదర్శి డాక్టర్ పార్వతీదేవి దండబోయిన, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎన్.శమంతకమణి, తెలుగు అధ్యాపకులు శ్యామసుందర శాస్త్రి, ఎం లక్ష్మయ్య, గుబ్బ బాలస్వామి, హైమావతి, సునీత, నీలిమ, సుబ్బలక్ష్మి,నంద్యాల అన్నం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఐపిఎస్‌ల బదిలీ మరింత ఆలస్యం

- కొలిక్కిరాని కసరత్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐపిఎస్ అధికారుల బదిలీ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నేడో.. రేపో బదిలీలు జరగొచ్చనే ప్రచారం జరిగినప్పటికీ కసరత్తు తుది దశకు చేరకపోవడమే ఆలస్యానికి కారణమని ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం. బదిలీల ప్రక్రియ రోజురోజుకూ ఆలస్యమవుతుండటంతో కీలకమైన ఎస్‌పి పోస్టుల కోసం కొందరు ఐపిఎస్ అధికారులు 'కోటరీ' చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా ఉన్నతాధికారుల బదిలీ విషయంలో ప్రభుత్వ పెద్దలు ఓ అభిప్రాయానికి రానట్లు స్పష్టమవుతోంది.

కూటమిలో టిడిపి, బిజెపి, జనసేన ఉండటంతో కొన్ని కీలకమైన పోస్టుల్లో నియమించే అధికారుల పేర్లు విషయంలో తలో ఒక పేరు సూచించడంతో ఈ ప్రక్రియ జఠిలంగా మారినట్లు సమాచారం. అలాగే బ్యూరోక్రసిలో కొందరు వైసిపి కీలక నేతలకు టచ్‌లో ఉండటంతోపాటు వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే వాదన తెలుగు తమ్ముళ్లు తెరపైకి తీసుకొచ్చారు. కాశ్మీరి విద్యార్థుల కోసం నోడల్ ఆఫీసరుగా పనిచేసిన ఎఐజి లా అండ్ ఆర్డర్ సిద్ధార్థ్ కౌశల్ ఇటీవల తన ఉద్యోగానికి వాలంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా సినీనటి జత్వాని కేసులో అప్పటి ఇంటెలిజెన్స్ ఐజి పిఎస్‌ఆర్ ఆంజనేయులు జైలుకు వెళ్లడం, ఇదే కేసులో ఐపిఎస్‌లు కాంతిరాణా టాటా, విశాల్‌గున్నీతోపాటు పలువురు ఉన్నతాధికారులు ఉండటంతో ఐపిఎస్‌లలో కొంత అభద్రత ఏర్పడిందనే అభిప్రాయం కలుగుతున్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చకు తెరలేపింది. అలాగే మాజీ సిఎం వైఎస్ జగన్ రెంటపాళ్ల పర్యటనలో వాహనం కింద ఓ వ్యక్తి చనిపోయిన సంఘటనలో గుంటూరు ఎస్‌పి తొలుత వేరే వాహనం కింద పడి మరణించాడంటూ వాహనం నెంబరు చెప్పడం, 48 గంటల తర్వాత వేరే వాహనం కాదు జగన్ ప్రయాణిస్తున్న వాహనం కిందనే పడి ఆ వ్యక్తి మరణించాడంటూ మీడియాకు చెప్పడం ప్రభుత్వ వర్గాల్లో చర్చకు తెరలేపింది. దీంతో ప్రతిపక్ష పార్టీల నుంచి పోలీస్‌శాఖ పలు విమర్శలు ఎదుర్కొంది.

రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని తరచు సిఎం చెబుతున్నప్పటికీ పలు సంఘటనల్లో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. గతేడాది నవంబరులో జరిగిన కేబినెట్ సమావేశంలో పోలీస్‌శాఖపై చర్చ సమయంలో నెలరోజుల్లో పోలీస్ వ్యవస్థ ప్రక్షాళన చేస్తామని సిఎం ప్రకటించినప్పటికీ ఇప్పటికీ ప్రక్షాళన చేయకపోవడం దేనికి సంకేతమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

తుంగభద్రలో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్నూలు జిల్లా రాఘవేంద్రస్వామి మఠం సమీపంలో తుంగభద్ర నదిలో గల్లంతైన ముగ్గురు యువకుల మతదేహాలు లభ్యమయ్యాయి. కర్ణాటకలోని హాసన్‌కు చెందిన ఏడుగురు యువకులు రాఘవేంద్రస్వామి దర్శనానికి శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. శనివారం సాయంత్రం తుంగభద్ర నదిలో నలుగురు యువకులు స్నానానికి దిగారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నదిలో అజిత్, సచిన్, ప్రమోద్‌లు కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం గాలింపు చేపట్టింది. తొలుత ప్రమోద్(20), అజిత్(19) మృతదేహాలు లభించగా ఆ తర్వాత సచిన్ (20) మృతదేహం లభ్యమైంది.

రైల్వే ఉద్యోగం..భవిష్యత్తు భద్రం

ఆర్ఆర్‌బి పరీక్షల ప్రత్యేకం

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

రైల్వే ఉద్యోగాలకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే ఇవి సురక్షితమైన, మంచి జీతం అందించే ఉద్యోగాలు. రైల్వే శాఖలో వివిధ రకాల ఉద్యోగాలున్నాయి. వాటిలో కొన్ని ఇంటర్మీడియట్ విద్యార్హతతో కూడా పొందొచ్చు. మరికొన్ని డిప్లమో, ఐటిఐ, బిటెక్, డిగ్రీ ఇలా పలు రకాల అర్హతలతో ఉద్యోగాలున్నాయి. ఆయా పోస్టులకు అనుగుణంగా నోటిఫికేషన్లు వచ్చినప్పుడు అభ్యర్థులు అప్రమత్తమై దరఖాస్తు చేసుకోవాలి. ముఖ్యంగా, రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి తెలుగు మాధ్యమాన్ని కూడా ఎంచుకోవచ్చు. ఇది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. రైల్వే ఉద్యోగాలు ప్రభుత్వ ఉద్యోగాలు కాబట్టి, సాధారణంగా సురక్షితమైనవిగా పరిగణిస్తారు. రైల్వే ఉద్యోగులకు మంచి వేతనాలు, ఇతర అలవెన్సులు లభిస్తాయి. ఇది ఆర్థికంగా స్థిరత్వాన్ని అందిస్తుంది. రైల్వే ఉద్యోగాల్లో ఉద్యోగోన్నతులు, ఇతర అవకాశాలు కూడా ఉన్నాయి. ఇది కెరీర్ వృద్ధికి దోహదం చేస్తుంది.

టెక్నీషియన్ గ్రేడ్-1 అర్హతలు :

- బీఎస్సీ, బీఈ, బీటెక్, డిప్లొమా (ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఇన్‌స్ట్రుమెంటేషన్).
- **టెక్నీషియన్ గ్రేడ్-3 :** మెట్రిక్యులేషన్, ఎస్ఎస్ఎల్‌సి, ఐటీఐ (ఎలక్ట్రీషియన్, వైర్‌మ్యాన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్, మెకానిక్, ఫిట్టర్, వెల్డర్, పెయింటర్ జనరల్, మెషినిస్ట్, కార్పెంటర్, ఆపరేటర్, అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్, మెషినిస్ట్, మెకానిక్, మెకానిక్ మెకట్రానిక్స్, మెకానిక్ డీజిల్, మెకానిక్ (మోటార్ వెహికల్), టర్నర్, ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్, గ్యాస్ కట్టర్, హీట్ ట్రీటర్, ఫౌండ్రీమ్యాన్, ప్యాటర్న్ మేకర్, మౌల్డర్ వంటివి). లేదా 10+2 (ఫిజిక్స్, మేథ్స్).
- **వయసు:** 01-07-2025 నాటికి టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు 18-33 ఏళ్లు
- టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, విభిన్నప్రతిభావంతులకు సడలింపు ఉంటుంది.
- **ఫీజు చెల్లింపులు ఇలా.. :** ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీలకు రూ.250. పరీక్షకు హాజరైతే బ్యాంకు ఛార్జీలు మినహాయించి, మిగిలిన ఫీజు ఇచ్చేస్తారు. ఇతరులకు రూ.500. పరీక్ష రాస్తే వంద తీసుకుని, రూ.400ల్లో బ్యాంకు ఛార్జీలు మినహాయించి వెనక్కి ఇచ్చేస్తారు.

దేశవ్యాప్తంగా 6,238 పోస్టులు

దేశవ్యాప్తంగా అన్ని రైల్వే రీజియన్లలో 6,238 టెక్నీషియన్ గ్రేడ్-1, గ్రేడ్-3 పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. వాటిలో

1. టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ : 183
2. టెక్నీషియన్ గ్రేడ్-3 : 6,055

ఆర్ఆర్‌బి రీజియన్ వారీగా ఖాళీలు:

అహ్మదాబాద్	-	174
అజ్మీర్	-	139
బెంగళూరు	-	140
భోపాల్	-	210
భువనేశ్వర్	-	38
బిలాస్‌పూర్	-	71
చండీగఢ్	-	446
చెన్నై	-	1,347
గౌహతి	-	184
జమ్మూ అండ్ శ్రీనగర్	-	296
కోల్‌కొతా	-	1,434
మాల్డా	-	70
ముంబై	-	891
ముజఫర్‌పూర్	-	239
పాట్నా	-	07
ప్రయాగ్‌రాజ్	-	239
రాంచీ	-	35
సికింద్రాబాద్	-	113
సిలిగురి	-	133
తిరువనంతపురం	-	197

రైల్వేలో ఉండే ఉద్యోగాలు ఇవే...

- కమర్షియల్ కం టికెట్ క్లర్క్
- అకౌంట్స్ క్లర్క్ కం టైపిస్ట్
- జూనియర్ క్లర్క్ కం టైపిస్ట్
- ట్రెయిన్స్ క్లర్క్
- అసిస్టెంట్ లోకో పైలట్
- టెక్నీషియన్

అయితే ప్రస్తుతం కేవలం టెక్నీషియన్ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ వచ్చింది.

సిలబస్‌ప్రకారం చదవాలి

గ్రేడ్ -3 పరీక్ష సన్నద్ధతలో సిలబస్ ప్రకారం విభాగాల వారీ ప్రాథమికాంశాల నుంచి ప్రారంభించి, పూర్తిగా చదవాలి. అందులో వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి. అధ్యయనం పూర్తయిన తర్వాత పాత ప్రశ్నాపత్రాలను పరిశీలించాలి. పరీక్ష కోణంలో ఆలోచించి, ఏయే అంశాలకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకుని, మళ్లీ చదవడం, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయటం చాలా ముఖ్యం. మాక్ టెస్టులు రాసి, ఫలితాలు విశ్లేషించుకోవాలి. తప్పులు పునరావృతం కాకుండా, పరీక్షల వారీ స్కోరులో మెరుగుదల ఉండేలా కృషి చేయాలి. తప్పులకు మైనస్ మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేయాలి. ప్రతి ప్రశ్నకూ 54 సెకన్ల వ్యవధి. మెళకువలు పాటించి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అర్థమెటిక్-రీజనింగ్‌కు ప్రాధాన్యత

మేథమెటిక్స్ విభాగంలో ప్రశ్నలకు ఆబ్జెక్టివ్ అర్థమెటిక్‌పై బాగా దృష్టిసారించాలి. ఈ విభాగంలో త్రికోణమితి, ఆల్జీబ్రా మొదలైన అంశాల కోసం పదో తరగతి గణిత పుస్తకాన్ని బాగా చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేయాలి. జనరల్ ఇంటలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగానికీ కూడా ఎక్కువ సమయం కేటాయించాలి. ఏ తరహా పుస్తకాలు చదివినా పరీక్షలో పేర్కొన్న అంశాలకే పరిమితమై, వాటినే బాగా సాధన చేయాలి. అర్థమెటిక్-రీజనింగ్‌కు సంబంధించిన పుస్తకాలు చదివితే మంచిది.

జనరల్ సైన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ

జనరల్ సైన్స్‌పై ప్రత్యేక శ్రద్ధతో చదవటం ఎంతో అవసరం. 100 మార్కుల పరీక్షలో ఈ విభాగానికే 40 కేటాయించారు. అందువల్ల వీలైనన్ని ఎక్కువ మార్కులు పొందాలి. 8, 9, 10 తరగతుల భౌతిక, రసాయన, జీవశాస్త్రాల పుస్తకాలు క్షుణ్ణంగా చదవాలి. ఆయా విభాగాల్లో ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ పాత, మాదిరి ప్రశ్నలు బాగా చదివితే ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంది. జనరల్ అవేర్‌నెస్ కోసం రోజువారీ దినపత్రికలను ఫాలో కావాలి. ఆయా పత్రికలను చదివి ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలు, కరెంట్‌అఫైర్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి.

- **మిగతా వివరాలు వెబ్‌సైట్ :** https://www.rrbapply.gov.inలో తెలుసుకోవచ్చు.
- **ఎంపిక:** రాత పరీక్ష (కంప్యూటర్ బేస్ట్ ఆప్టిట్యూడ్ టెస్ట్), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌తో.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు తుది గడువు :** 28.07.2025.
- **ఫీజు చెల్లింపు ఆఖరి తేదీ :** 30.07.2025.

జోన్ల ప్రాధాన్యాన్ని ఎంచుకోవాలి

గత సంవత్సరమే రెండుసార్లు టెక్నీషియన్ గ్రేడ్-1, గ్రేడ్-3 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. తక్కువ వ్యవధిలోనే మరో నోటిఫికేషన్ రావడం ఆశావహులకు మంచి మేలు చేసేలా ఉంది. నియామకాలు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బి)ల వారీ ఉంటాయి. పరీక్ష అందరికీ ఉమ్మడిగా నిర్వహిస్తారు. ఆర్ఆర్‌బి జోన్లలో ప్రాధాన్యాన్ని ఎంచుకోవాలి. తెలుగు మాధ్యమంలోనూ పరీక్ష రాసుకోవచ్చు. అర్హతలు ఉన్నవారు రెండు పోస్టులకూ విడిగా దరఖాస్తు చేసుకోవచ్చు.

టెక్నీషియన్ గ్రేడ్-1లో ఖాళీలు 183

- **విద్యార్హత:** ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్‌సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ వీటిలో ఏదైనా ఒక సబ్జెక్టుతో బీఎస్సీ, డిప్లొమా, బీఈ,బీటెక్.
- **వేతనం:** గ్రేడ్-1 టెక్నీషియన్లకు లెవెల్-5 రూ.29,200 మూల వేతనం, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులన్నీ కలిపి సుమారు రూ.60 వేల జీతం పొందొచ్చు.
- **పరీక్ష:** కంప్యూటర్ బేస్ట్ పద్ధతిలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు, 100 ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 90 నిమిషాలు. జనరల్ అవేర్‌నెస్ 10, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 15, కంప్యూటర్ అప్లికేషన్స్ బేసిక్స్ 20, మ్యాథమెటిక్స్ 20, బేసిక్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ 35 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి.

టెక్నీషియన్ గ్రేడ్ -3 ఖాళీలు: 6055.

- **విద్యార్హత:** పదో తరగతి తర్వాత సంబంధిత ట్రేడులు/విభాగాల్లో ఐటీఐ లేదా అప్రెంటిస్‌షిప్
- **వయసు:** జులై 1, 2025 నాటికి వయసు 18-30 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- **వేతనం:** గ్రేడ్-3 టెక్నీషియన్లకు లెవెల్ -2 రూ.19,900 మూల వేతనం, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులన్నీ కలిపితే సుమారు రూ.40 వేల జీతం పొందొచ్చు. అనుభవం, అంతర్గత పరీక్షలతో వీరు గ్రేడ్-2, గ్రేడ్ -1 టెక్నీషియన్లుగా ఉద్యోగోన్నతి పొందొచ్చు.
- **పరీక్ష:** ఆన్‌లైన్‌లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. 100 ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 90 నిమిషాలు. మ్యాథమెటిక్స్ 25, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 25, జనరల్ సైన్స్ 40, జనరల్ అవేర్‌నెస్‌లో 10 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి.

అర్హత ఇలా...

- గ్రేడ్-1, గ్రేడ్ -3 పరీక్షల్లో అర్హత సాధించడానికి అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యుఎస్‌లు 40, ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీ 30, ఎస్టీ 25 మార్కులు పొందాలి. ఇందులో మెరిట్‌లో ఉన్నవారి ధ్రువ పత్రాలు పరిశీలించి, వైద్య పరీక్షల అనంతరం ఉద్యోగానికి తీసుకుంటారు.
- గ్రేడ్-1, గ్రేడ్ -3 రెండు పరీక్షల్లో ప్రతి తప్పు సమాధానానికీ 1/3 వంతు మార్కు తగ్గిస్తారు.
- రెండు పోస్టులకూ ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, విభిన్న ప్రతిభావంతులకు 10 నుంచి 15 ఏళ్ల గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 14 జులై 2025

"సామాజిక జీవితం లేకపోతే
సాహిత్యం అనేదే సాధ్యం కాదు.
ఈ సంగతి జ్ఞప్తిలో ఉంచుకుంటే
సాహిత్యం ఎందుకు? ఎవరికి? అనే
రెండు ప్రశ్నలకూ జవాబు వస్తుంది.

– మహాకవి శ్రీశ్రీ

ఆమె ఆత్మహత్య

రెక్కల కింద వాలి
ఆమె ముగిసిపోయింది
ముగింపు బిందువు దగ్గర నిల్చుని
ముగింపు తీరును బట్టే
బతుకు పొడుగూ వెడల్పూ
లోతూ చెప్పగలమా?

అందరి ప్రపంచానికొచ్చాక
అందులో తనదైన ఓ ప్రపంచాన్ని
నిర్మించుకోవడానికి
ఆమె యత్నించే వుంటుంది
రెక్కలను విశాలంగా విప్పార్చి ...

కొంతో మరింతో గమించాక
ఏదో మజిలీలో ఏవో చీకటి మబ్బులు
దట్టంగా కమ్ముకున్నపుడు
ఇక ముందు తనకై ఏమీ లేదని
అనుకున్నాకనే ఆమె ముగింపుగా
వేలాడిందా ఇష్టంగానో అయిష్టంగానో ...!

మొదలు పిదప
ముగింపుకు ముందు
ఆమె ఎంచుకున్నది
ఏ చూపూ ఏ నడకా
ఏ విరామమూ ఏ మజిలీ
ఏ తోడూ ఏ ఎడమూ
ఏ పలుకూ ఏ చూపూ
ఏ విలువా ఏ తెగువా
ఏ చేతా ఏ రీతీ
ఏ ఆశా ఏ స్వప్నం
అన్నీ కలిపితేనే ఆమె దారి

ఎంచుకున్న దారి దారంతా
చేదు ముగింపుకు దారి తీసిందా?
కాక ఒక మలుపు దగ్గర దారి తప్పిందా?
కాక ఒక క్షణంలో దారినే మరిచిందా?

ముగింపు కాసిన్ని క్షణాల్లోనే కానీ
అది అంతకు మునుపటి
ఆమె కోట్ల క్షణాల జీవన పర్వాన్ని
మాయం చేసింది కదా!

ముగింపులో అర్థం లేనందున
బతుకంతా వ్యర్థం అనగలమా!

రెక్కల కింద ముగింపును కూడా ఆమె
రెక్క విప్పారడంగానే భ్రమించిందా,
ఆ ఉద్రిక్త క్షణంలో?
మూడు రెక్కల కింద నిలిచిన ఆ క్షణంలోనే
ఆమె తన రెండు రెక్కల పటిమను
కళ్ళారా చూసుకుని వుండి వుంటే
ఒక పచ్చని దారి ఆమెకు కనపడేదేమో!
తననే నమ్ముకున్న, తానే సాదాల్సిన
పసి రెక్కలు అపుడు గుర్తుకొచ్చినా
అర్ధాంతర ముగింపు అర్థ రహితమని
ఆమె సైతం అనుకుని వుండేదేమో!

స్వేచ్ఛ విప్పారుతూ జీవించడానికే గానీ
దారి నడుమనే నిష్క్రమించడానికి కాదని
ఆమెకు ఎప్పుడో దారిలో ఎక్కడో ఎలాగో
ఎవరో ఒకరు చెప్పి వుంటే ఎంత బాగుండేది!

అయినా
దారుల్లో అసలు మనం
బతుకు పుష్పం గురించి
ఒకరికొకరం ఏం మాట్లాడుకుంటున్నామని!

– దర్భశయనం శ్రీనివాసాచార్య
94404 19039

ఎందుకు?

అతన్ని చంపేస్తున్నారు!
ఏమైంది దేశానికి!?
ఆరుగాలం కష్టం
స్టాక్ మార్కెట్ ఎద్దు కాదు.
విలువైన చెమట నీరు
విజయ మాల్యా విసిరేసిన
కింగ్ ఫిషర్ బీరు కాదు.
ఒక మామిడికాయ..
ఒక టమాట పండు..
ఒక ఉల్లిపాయ..
ఒక క్యాబేజీ పువ్వు..
ఒక జీడిపిక్క..
ఇవేమీ.. ఏసీ మాల్స్‌లో
మార్కెట్ యార్డుల్లో
సాదా సీదా బజార్లలో పండవు!

భూమి.. దానికో ప్రేమ!
విత్తనం.. దానికో తేమ!
మొక్క.. దాని చుట్టూ దోసిళ్ల
పూత పూల భాష తెలిసిన కన్నీళ్లు!
పాదు కట్టడం.. పందిరేయడం
తెల్లారేసరికి దాని గుండె చప్పుడు వినడం..
అతడు పనిగంటలు తెలియనివాడు
టిఏ, డిఏ, బోనస్, లీవ్స్, అలవెన్స్ తెలియని వాడు ...
కష్టం వస్తే, దేశం విడిచిపోకుండా
పుట్టిన గడ్డ మీదే ఊపిరి తీసుకునే
ఏకైక నిజాయితీపరుడు!
రైతు లేని రాజధాని
గౌరవమా! రాజ్యానికి!?

– నల్లి ధర్మారావు,
76609 67313

చేజారాక ...

బుడి బుడి అడుగుల బుడతడు
బడి నుండి వచ్చాడు
అమ్మ ఒడి అడిగాడు
నాన్న చెలిమి కోరాడు
బదులుగా చేతికి సెల్‌ఫోన్ పొందాడు
వల వైపు చేపలా,
వడివడిగా దూసుకుపోయాడు
అమ్మానాన్నలకు దూరంగా
అంతర్జాలమే సర్వంగా..
అసలు లోకమే భారంగా..
ఇక ఏడ్చి లాభమేది?

కలిసి గడిపినా పోయేది
కాసేపు కథలు చెప్పినా సరిపోయేది
కడకు కాగితపు పడవ ఇచ్చినా
గొడవ లేకపోయేది
ఆ పరిమళం పరిచయమయ్యేది
ప్రపంచం విస్తృతమయ్యేది
జీవన సౌందర్యం ఆవిష్కృతమయ్యేది!

– డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931

సారవంతమైన కథల భూమి 'లేళ్ళమెరక'

కోనసీమ రైతుల పంట విరామం.. దాదాపు లక్ష ఎకరాల్లో వరి పంట సాగుకి విరామం ప్రకటించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులందరూ కలిసి ఐక్యంగా ఆందోళన చేయడానికి సిద్ధ పడడం 2011లో తెలుగు నాట ప్రముఖమైన వార్తా విశేషం. రైతుల ఉద్యమానికి ప్రభుత్వం దిగి రావాల్సిందే అని తలచారు అందరూ. "పిల్ల కాకికి ఏం తెలుస్తుంది ఉండేలు దెబ్బ. అన్నీ జరిగి పంట విరామం చేస్తే సారవంతమైన పొలం బంజరు భూమిగా మారుతుంది. అమ్మకం పెట్టినా ఎవడూ కొనడు. తొండలు గుడ్లు పెట్టుకుంటాయి. అపుడెవరికికావాలి? వ్యవసాయం మీద ఆధారపడి బతికేవోడు మరో పని చేయగలడా? గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంటే పొద్దు గడవొద్దా?" అని సూటిగా ప్రశ్నించాడు వెంకటపతి రాజు, పంట విరామం హడావిడి జరుగుతున్న ఆ రోజుల్లోనే ఓ ప్రముఖ దిన పత్రిక ఆదివారం అనుబంధంలో వచ్చిన 'లేళ్ళమెరక' కథలో ప్రధాన పాత్ర.

ఈ కథ రాసింది కోనసీమకి కూత వేటు దూరంలో వున్న యానాం వాసి, కవీ, కథకుడూ, 'కలైమామణి' దాట్ల దేవదానం రాజు. కథలో వెంకటపతి రాజులాగే చాలామంది రైతులు ఆలోచించడం వల్ల కావొచ్చు, 'పంట విరామం' ప్రకటించిన రీతిలో జరగలేదు. అయితే, చుట్టూ ఉన్న పరిస్థితుల్ని అంచనా వేసి, భవిష్యత్తుని ఊహించే శక్తి కవులు, రచయితల్లో ఓ పాలు ఎక్కువే వుంటుందని మరోమారు రుజువయ్యింది. తర్వాతి పదకొండేళ్ల కాలంలో, అంటే 2011- 22 మధ్య కాలంలో దేవదానం రాజు రాసిన 21 కథలతో 'ఛాయ' వెలువరించిన కథల సంకలనానికి శీర్షిక 'లేళ్ళ మెరక.' ఈ సంకలనంలో ఉన్న కథలన్నీ వ్యవసాయ ప్రధానమైనవి మాత్రమే కాదు. నిజానికి నిర్దిష్టమైన ఇతివృత్తానికి, స్థల కాలాదులకి చెందినవి కూడా కాదు. ఇతివృత్తం మొదలు, కథనం, పాత్ర చిత్రణ వరకూ ప్రతి కథా దేనికదే ప్రత్యేకమైనవి, ఆసాంతమూ ఆపకుండా చదివించేవి.

తన గత కథా సంకలనం 'యానాం కథలు'లో 'తీర్పు వెనుక' లాంటి కథల ద్వారా ఫ్రెంచి పాలనలోని మంచి విషయాలని ప్రస్తావించిన ఈ రచయితే, ప్రస్తుత సంకలనంలో 'కోరంగీలు' కథ ద్వారా నాటి యానాం పాలకుల చీకటి కోణాలని బయట పెట్టారు. కట్టు బానిసల కథల కోసం మనం ఆఫ్రికా వరకూ వెళ్లనవసరం లేదని చెబుతుంది ఈ కథ. మేజిక్ రియలిజంతో చెప్పిన స్త్రీవాద కథ 'అసహనం' ఆసాంతం ఆసక్తిగా చదివిస్తుంది. మృత్యువు చుట్టూ అల్లిన స్త్రీవాద కథ 'పిడికెడు నవ్వు' పాఠకుల్ని ఆలోచనలో పడేస్తుంది. 'టామా' కథని ఒక ప్రయోగం అనాలి. చదువుతున్నంత సేపూ పెంపుడు పిల్లి కథే, కానీ చదవడం ముగించాక రచయిత చెప్పదల్చిన కథలు ఒక్కొక్కటిగా ఆలోచనల్లోకి వస్తూ ఉంటాయి. 'అతడు గోదారి ఎదురీదాడు' కథకి రచయిత ఇచ్చిన ముగింపు ప్రత్యేకమైనది. కథా నాయకుడి నిర్ణయాన్ని పాఠకులు ఎలా అయినా అన్వయించుకోవచ్చు.



కాలంతో పాటు మారే విలువలని 'రెక్కలు విరిగిన కాలం' కథ నేరుగా ప్రస్తావిస్తే, ఇదే విషయాన్ని 'దీపం కింద నీడ' కథ పరోక్షంగా చెప్పింది. వంశీ కథల్ని జ్ఞాపకం చేస్తుందీ కథ. కథలన్నీ వేటికవే ప్రత్యేకమైనవే అయినా, వ్యవసాయం, వృద్ధాప్య సమస్యలు, విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు, ఈ మూడింటిలో రెండేసి ఇతివృత్తాలని కలిపి కథలుగా అల్లడం వల్ల 'పునరుక్తి' అనిపించే అవకాశం వుంది. 'ఇతరేతరం' కథ వృద్ధ దంపతులు, వాళ్ళ పిల్లల విడాకుల చుట్టూ సాగితే, 'చిట్టచివరి ఋతువు' కథ వృద్ధాప్యం, వ్యవసాయం, విలువల మార్పుని చర్చకి పెట్టింది. 'పులస' వృద్ధ దంపతుల సమస్యలని, 'ముఖం విలువ' కథ వృద్ధాప్యం, విడాకులు ఇతివృత్తంగా సాగింది. 'సీరమేను కూర' ఓ వృద్ధుడి చివరి కోరిక చుట్టూ అల్లిన కథ, కాగా 'ఆమె ఎవరైతేనేం' విడాకుల కథ.

సంపుటానికి శీర్షికగా ఇచ్చిన 'లేళ్ళ మెరక'తో పాటు, 'ఎడ్లబండి', 'ఆనాటి వాన చినుకులు', 'అభద్రత' కథలకి ముడి సరుకు రైతు జీవితం. ఎడ్లని కుటుంబ సభ్యులుగా చూసే మమకారాన్ని 'ఎడ్లబండి'లో చిత్రించారు. ఇంటి మనుషులుగా భావించే పని మనుషులని అనుమానించే బాధాకర సందర్భాన్ని 'ఆనాటి వానచినుకులు'లో ప్రస్తావించారు. రైతుచట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధానిలో జరిగిన ఉద్యమాన్ని ప్రతీకాత్మకంగా చెప్పిన కథ 'అభద్రత'. కరోనా కథా కాలంగా రాసిన కథలు రెండు, 'రహస్య మిత్రుడు', 'ఆరిందా.' 'ఒక పొరపాటుకు యుగములు కుమిలేవు' అనే కవి వాక్యాన్ని 'రహస్య మిత్రుడు' గుర్తు చేస్తే, మారిన కాలానికి తగ్గట్టుగా టెక్నాలజీని ఒడిసి పట్టుకుంటున్న పిల్లల జీవితాలని 'ఆరిందా' కళ్ళముందు ఉంచుతుంది. పిల్లల్ని ఎలా పెంచకూడదో చెప్పే కథ 'సమ్మెట దెబ్బ'.

'ఆరోగ్యకరమైన కథలు' పేరుతో ఈ సంకలనానికి ముందుమాట రాశారు కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివ శంకర్. ఈయన పేరు చెప్పగానే గుర్తొచ్చే కథ 'సముద్రాన్ని ఎక్కడ పారబొయ్యాలి'. ఈ సంపుటిలో 'వొక మెలకువ' కథ కూడా ఈ కథని గుర్తు చేస్తుంది. 'తదనంతరం?' అనే ప్రశ్నకి సరైన జవాబు దొరక్క పోవడంతో, జీవితకాలం ఇష్టంగా చదువుకున్న పుస్తకాలని కట్టకట్టి గోదాట్లో పడేయాలని నిర్ణయించుకున్న ఓ వృద్ధుడి కథని ఎంతో హృద్యంగా చెప్పారు. దాదాపు అన్ని కథలకీ ఇతివృత్తాలు పరిశీలన నుంచే వచ్చాయని కథలు చదువుతున్నప్పుడే అర్థమవుతుంది. కథకుడిగా దేవదానం రాజు అనుభవం ఆ పరిశీలనలని కథలుగా మలచడంలో కనిపిస్తుంది. ముందుమాటలో పాపినేని చెప్పినట్టుగా, కొన్ని కథల్లో కనిపించే ఉపోద్ఘాతం కథని ముందే చెప్పేసి ముగింపు పట్ల ఓ అంచనాని ఇచ్చేస్తుంది. రచయిత శ్రద్ధ పెట్టవలసిన మరో ముఖ్యమైన విషయం సంభాషణలు. మరీ ముఖ్యంగా శ్రమజీవుల భాషనీ, యాసనీ మరింతగా కథల్లోకి తీసుకు రావాల్సి వుంది. మొత్తంగా చూసుకుంటే ఈ 'లేళ్ళ మెరక'లో కథలన్నీ సారవంతమైనవే! 200 పేజీలు, రూ.200ల వెల ఉన్న ఈ పుస్తకాన్ని 7093165151 నెంబరును సంప్రదించి పొందొచ్చు.

– కె.ఎన్.మురళీ శంకర్
94401 34256

మనిషి గాయాలు మౌనాక్షరాలై ...

అనేక సామాజిక సమస్యలతో సంఘర్షిస్తూ మనిషి పడే వేదనలకు అక్షరరూపం ఇచ్చారు వర్తమాన కవి బిల్ల మహేందర్. ఆయన వెలువరించిన తాజా కవితా సంపుటి 'నేను మరణిస్తూనే వున్నాను'... పుస్తక శీర్షికతోనే సూదంటురాయిలా ఆకట్టుకుంటుంది. సమకాలీన సంఘటనాత్మక దశ్యాలను వొడిసిపట్టుకున్న ఈ కవి కవిత్వం జీవనతాత్వికతను పులుముకొని నిరంతరం మానవత్వపు అన్వేషణలో తన అక్షరయానాన్ని సాగిస్తూ వుంది. ఒట్టిపోయిన మనుషుల్లో గట్టితనాన్ని వెతుకుతూ వుంది. ప్రకతిని వాక్యం చేయగలిగినా మనిషిని వాక్యం చేయడానికి సాధ్యం కాక, వాక్యం చేయడానికి సాధ్యమయ్యే మనిషి కోసం తపిస్తూ వుంది. ముఖ్యంగా దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతూ దానిని ఈ కవి చేత ఆచరణ సాధ్యమూ చేసింది. అనేక మానవీయ దశ్యాలను స్పృశిస్తూ సామూహిక దుఃఖ గానాన్ని తన గానంగా ఆలపిస్తూ వుంది. ఇప్పటివరకూ ఆరు కవితా సంపుటాలను వెలువరించిన ఈ కవికి ఇది ఏడో కవితా సంపుటి. మరో నాలుగు కవితా సంకలనాలకు ఆ కవి సంపాదకత్వం వహించారు. మహేందర్ కవిత్వానికి మనిషితనమే కేంద్రబిందువు. అదే ఇతని అక్షరాల అలలకు సింధువు. మహేందర్ కవిత్వం .. విద్వేషాలతో, విధ్వంసాలతో పోగొట్టుకుంటున్న మానవీయ విలువల్ని కోరుతుంది. బహుజన సామాజిక వికసనాన్ని అభిలషిస్తుంది. విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలు మనిషి జీవితంలో సష్టిస్తున్న శూన్యాలు, చెమట చుక్కలతో నగరాల్ని శిల్పాల్లా మలిచే శ్రమజీవన సౌందర్యం, దోపిడీకి గురయ్యే పూలపరిమళం, పచ్చని ఇంకుతో చేసిన మట్టిసంతకం మహత్తును ప్రపంచానికి చాటిచెప్పే చెమట పద్యం లాంటి రైతు జీవనయానం, ప్రకతి విధ్వంసానికీ, మనుషుల మధ్య అనుబంధాల విధ్వంసానికీ దారితీస్తూ ఆకుపచ్చని అందాలన్నింటినీ మింగేస్తున్న ప్రపంచీకరణ దుస్థితి, మనుషుల మధ్య ఎన్నో గోడలు లేచి గాయపడిన సారం, పేగుల్ని పోగులు పోగులుగా రాట్నంతో వడుకుతూ కండలను కండెలుగా చేసి వొంటిచేత్తో పట్టుబట్టలను నేసే బతుకు పోరు ఈ కవిత్వం నిండా పరుచుకొని ఉంటుంది. మనిషి బతుకులోని చీకటిని పారద్రోలే అంబేద్కర్ చూపుడు వేలు, బతుకుకు అద్దం లాంటి అమ్మతనం, నూతన చరిత్రను లిఖించడానికి పిడికిలెత్తే చూపుల సంగమం, దగాపడ్డ స్త్రీల చైతన్యపు తెగింపు... ఇవన్నీ ఈ కవికి కవితా వస్తువులయ్యాయి.

'ప్రతి మనిషీ యోధుడిలా పోరాడుతూ వుండడమే జీవితం.... ఉన్నది ఉన్నట్టుగా/ బతకడమే నేరమైన చోట/ ఇప్పుడు ఏ పొద్దును ప్రేమించను/ ఏ కాలమ్మీద

నిర్భయంగా నిలబడగలను' (బతకడమే ఓ యుద్ధం) అంటూ సామాజిక సంఘర్షణ ఎందులోంచి ఉద్భవిస్తుందో ఈ కవి చెబుతాడు. 'బతకడమే ఓ యుద్ధం' అంటూ జీవన మనుగడ కోసం బతుకుపోరు తప్పనిసరి అంటాడు. 'పిడికెడు ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలని/ ఏ తీరం వెంబడి పయనించినా/ గాయాలు అలలు అలలుగా తాకుతూనే వున్నాయి... నా దేశం ఏ కులంగానో, మతంగానో/ విడిపోయిన ప్రతిసారీ/ నేను మరణిస్తూనే వున్నాను... బతుకంతా అసమానత శిలువ మోస్తున్నాను/ నేను మరణిస్తూనే వున్నాను' అంటూ అసమానత అనే రుగ్మత మనిషి జీవితాన్ని ఎంతగా కంగదీస్తుందో మహేందర్ పేర్కొంటాడు. భరించలేని బాధకు పరాకాష్ట మరణమే. అందుకే ఒక మనిషి ద్వారా మరో మనిషి పడే అనంతమైన సామాజిక వేదనలను కవి మరణాలతో పోలుస్తాడు. 'అంతగా నిన్ను ప్రేమించలేను/ పరిమళం నాకొక మత్తు... తీరం దాటాక కులంకోతలు వుంటాయి' (రా) అంటూ ఒక ప్రేమికుని నిస్సహాయతతో ప్రేమికుల మధ్య ప్రేమను మాయం చేసే సామాజిక అడ్డంకుల్ని సూచిస్తాడు. అన్ని లాక్‌డౌన్ల కంటే ఆకలిని లాక్ డౌన్ చేయడమే ముఖ్యమంటాడు.

కవిత్వం ఎలా రాయాలో, అసలు కవిత్వమంటే ఏమిటో ఈ కవి తనదైన శైలిలో చెబుతాడు. 'కురుస్తున్న వర్షాన్ని/ చినుకు చినుకు తడిసి ముద్దవుతున్న పువ్వును/ అది నలుగురికి పరిమళాన్నివ్వడాన్ని రాయి/ మనిషి పువ్వల్లే నిండుతనంగా వుండాలనే ధర్మాన్ని రాయి... నిప్పుల్లో కాల్చినా/ నిలబడే వాక్యాన్ని రాయి' అంటూ పిలుపునిస్తాడు. ఆకలితో అలమటించే పిల్లవాడికి రొట్టెముక్కను అందించడమూ కవిత్వమేనంటాడు. కాలుతున్న కడుపును ఆకలి తీర్చేటందుకు అమ్మచేతిలో మెత్తగా కలిపిన పెరుగన్నం ముద్దలెక్క (మాట) మనిషి మాట వుండాలంటాడు. 'ఇప్పుడు నువ్వు దుఃఖాన్ని పోగేసుకోవడమంటే/ నీలోని అహాన్నంతా విడిచిపెట్టడమే/ దుఃఖించడమంటే/ నిన్ను నువ్వు సరిగ్గా వెతుక్కోవడమే' (దుఃఖించు) అంటూ దుఃఖమే మనసును ప్రక్షాళన చేస్తుందనడం కవి తాత్విక ధోరణిని తెలియజేస్తుంది. ఈ కవి స్త్రీ పక్షాన నిలబడి భార్య ఇంట్లో లేనప్పుడు అక్కడి దశ్యాలను కవిత్వీకరిస్తాడిలా... 'ఇంటిముందు వాకిలి/ తానమాడలేదని చిన్నబుచ్చుకుంటుంది/ గదిలోని దుమ్మంతా నెత్తికెక్కి కూర్చుంటుంది' (ఆమె పొద్దున్నే ఊరెళ్లినప్పుడు)... ఈ వాక్యం ద్వారా పరోక్షంగా భార్యాభర్తల మధ్య వుండవలసిన శ్రమ సమానత్వాన్ని గుర్తుచేస్తాడు.

ఎన్నో జీవితాలను శ్మశానాలుగా మార్చి వేస్తున్న యుద్ధంపై నిరసనను ప్రకటించింది ఈ కవిత్వం. గాజాలోని యుద్ధ బీభత్సాన్నీ, ఆ బీభత్సంలో పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రుల గుండెకోతనూ స్పృశించింది. 'గతం, వర్తమానం చిరునామా లేకుండా ధ్వంసమవుతున్నప్పుడు/ భవిష్యత్తు కోసం రాశిఫలాన్ని చూడలేను/ క్రోధీ.. ఒకసారి వసంతాన్ని తీసుకెళ్లి/ గాజాకు చిగుర్లు తొడిగిరావూ' (గాజా) అంటూ క్రోధినామ సంవత్సరాన్ని కవి వేడుకుంటాడు. ఈ కవి కవిత్వంలో వస్తువైవిధ్యమూ కనిపిస్తుంది. అందుకే వివిధ సందర్భాల్లో తన ఉనికిని ఎలా చాటుకుంటుందో తెలిపే భార్య మెడలోని వాసంత హారమూ, సీతాకోకచిలుకలన్నింటినీ తన వొంటినిండా చేర్చుకొని ముత్యమై మెరిసే బడీ, తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని ద్విగుణీకతం చేసే కాగితం పడవా... ఇవి కూడా ఈయనకు కవితా వస్తువులయ్యాయి. 'గది నాలుగు గోడల మధ్య/ నడుము వంగి చేతులు చచ్చుబడి/ కాళ్లలో పట్టులేక నిలబడలేని బతుకు/ ఏనాడో క్వారంటైనుకు చేరింది' (లాక్ డైన్ మాకు కొత్తకాదు) అంటూ ఈ కవిత్వం పేదలు ఎప్పుడూ అనుభవించే లాక్‌డౌన్‌ను వర్ణిస్తుంది. 'ఇప్పుడైనా/ కులాన్ని, మతాన్ని కాంక్రీటు గోడలను దాటి/ ముళ్లకంపలను పెకలించి/ గాయపడ్డ మట్టిని' చేతుల్లోకి తీసుకొని మనసారా ముద్దాడాలని తపిస్తుంది. ప్రపంచీకరణ కబంధ హస్తాల్లోకి వెళ్లని మట్టిని కలగంటుంది. పరిమళభరితమైన మనసుతో మనిషి పుష్పించాలంటుంది. దేహాలను తూకం వేస్తూ, అవయవాలకు కొలతలు తీస్తూ సౌందర్యాన్ని కొలిచే దేశం ఎప్పుడో వైకల్యం బారిన పడినందున ఆ వైకల్యాన్ని తొలగించడానికి సరికొత్త శస్త్రచికిత్స చేసే నిపుణుల కోసం అన్వేషిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి నిలువెల్లా చేసే గాయాల్ని అక్షరాలుగా మార్చింది ఈ కవిత్వం. పేజీలు 134, వెల రూ.150 ఉన్న ఈ పుస్తకం ప్రతుల కోసం 91776 04430 నెంబర్లో సంప్రదించొచ్చు.

– డాక్టర్ కొత్వాలు అమరేంద్ర ,91777 32414

బాలల కోసం 'తెలుగు ఒడిలో ...'

రచయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి... తను ఏది రాసినా భావి సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా రాస్తారు. సాహిత్యంలో ఏ ప్రక్రియ చేపట్టినా, ఎంతటి విలక్షణ రచన చేయాలన్నా ముందు భాషపై గట్టి పట్టు ఉండాలని నిండుగా నమ్మిన మల్లీశ్వరి, భావి రచయితలకు భాషా పుష్టి కలిగించటానికి అనేక ప్రయత్నాలు చేశారు. సుదీర్ఘకాలం బాలలతో అత్యంత చేరువగా నడయాడిన ఆమె వారి మనసెరిగిన రచయిత్రిగా... ఉపయోగించే భాషలోనూ, చెప్పే తీరులోనూ నేటి తరం బాలలకు అనుగుణంగా జాగ్రత్తలు పాటిస్తూ రచనలు చేస్తున్నారు. అందులో భాగంగానే 'బాలల కోసం తెలుగు ఒడిలో' అనే పుస్తకం వెలువరించారు. సాధారణంగా 'పదనిధు'లైన శబ్ద రత్నాకరాల గురించి అందరికీ తెలుసు. అవి వివిధ రకాలుగా ఉండి పాఠకులకు పదాల అర్థాలు, నానార్థాలు, ఉత్పత్తి అర్థాలు తెలుపుతూ భాషా విజ్ఞానం పంచుతాయి. అదే కోవకు చెందినదిగా కనిపిస్తున్నా.. కాస్త వినూత్నంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దడంలో రచయిత్రి సఫలమయ్యారు. చెట్లు, పుష్పాలు, జంతువులు, పక్షులు, రుచులు, తదితర అంశాలను ఎంపిక చేసి సంబంధిత అంశాల్లోని పదాలకు చెందిన అర్థాలు నానార్థాలు మాత్రమే చెప్పి ఊరుకోకుండా ఆయా పదాలకు సంబంధించిన పురాణ, సాహితీ సంబంధ విశేషాలు; సామెతలు, నానుడులతో పాటు బాల సాహిత్య గేయాలు, పాటలు కూడా ఇందులో పొందుపరిచారు. దీనివల్ల విద్యార్థులకు పదాల అర్థాలు తెలుసుకోవడంతో పాటు వాటి నేపథ్యాలు సహేతుకంగా అర్థమై, కలకాలం గుర్తుండిపోతాయి. విలువైన భాషా చరిత్ర తెలుస్తుంది.

జీవులకు ప్రాణాధారం అయిన నీరు గురించిన వివరణలో నీళ్లు అనే పదాన్ని ఎన్ని రకాలుగా రాయవచ్చో వివరించి, దానికి గల అప్పు, అగ్నిజము, సత్యము మొదలైన అర్థాలను కూడా చెప్పడం ఆసక్తిదాయకంగా ఉంది. నీటితో ముడిపడిన తెలుగు సామెతలు కూడా జోడించారు. 'నీటి పైన గుండు మునగక నిలుచునా?', 'నీరు ముత్యమైనట్లు ముత్యము నీరుగా మారునా?' వంటి కొత్త సామెతలు కూడా గుర్తు చేశారు. నీటి యొక్క మరో పేరు జలము కనుక దానితో కలిసివచ్చే పదాలను ఇందులో పరిచయం చేస్తూ సముద్రాన్ని 'జలపతి' అని, అంతర తామరను 'జలవల్లి" అని, జల ఆధారంగా జీవించే మొసలిని 'జలసూచి' అంటారని విపులీకరించారు. 'అల'ను 'నీటికొండ' అని, నక్షత్రాలుగా చెప్పే పూర్వాషాడను 'నీటి రిక్క' అని, శతభిషను 'నీటి రేని రిక్కరి' అని, మనం అతి సాధారణంగా పిలిచే నీటికి గల భాషా విషయాలు, విశేషాలు గురించి అద్భుతంగా చెప్పారు. దీనివల్ల తెలుగు భాషా వైభవం గురించి తెలియడమే గాక భాషపై అభిమానం ఆసక్తి పెరుగుతుంది. తెలుగు నేర్చుకోవాలనే ఇష్టం పెరుగుతుంది. ప్రకృతికి సొగసులు అద్దే పూల గురించి మనకు బాగా తెలుసు అనుకుంటాం. కానీ ఆ పూలలోని రకాలు, ముఖ్యంగా తీగ పూల గురించి అంతగా అవగాహన ఉండదు. ఆ తీగ పూల గురించి అర్థాలు, పేర్లు మాత్రమే వల్లె వేయకుండా– తీగజాతి పూలన్నీ సాయంత్రం మాత్రమే పూస్తాయనే వైజ్ఞానిక సత్యాన్ని కూడా చెప్పడంలో రచయిత్రి బాధ్యత ఏమిటో అర్థం అవుతుంది. ఆబాల గోపాలం ఇష్టపడే ఆటల గురించి వివరిస్తూ, అర్థాలు చెబుతూ వివిధ రకాల క్రీడా విశేషాలను తెలియపర్చారు. పూర్వకాలపు మన గ్రామీణ క్రీడల వివరాలు కూడా క్షుణ్ణంగా పొందుపరిచారు. ఆటలకు సంబంధించిన వివిధ గేయాలు సైతం అందించారు. రుచులు విభాగంలో షడ్రుచులను పరిచయం చేసి వదిలివేయకుండా ఆయా రుచులు లభ్యమయ్యే కారకాలను ఉదహరించారు. మానవజాతిలో భాగమై జీవిస్తున్న జంతువుల ప్రస్తావన కూడా ఇందులో ఇచ్చారు. కపటానికి, మోసానికి చిరునామాగా చెప్పుకునే 'నక్క' గురించి చెబుతూ– కిగి, జంబుకము, బుద్ధిమెకము, వంచకము, సగ్గారి, నృగాలము, శివ మొదలైన అనేక అర్థాలను తెలియజేశారు. నక్క నేపథ్యంలో గల సామెతలు, జాతీయాలు తదితరాలు పొందుపర్చారు. చెట్లలో ప్రధానమైనది ఏది? అంటే ఇదీ అని కచ్చితంగా చెప్పలేం. దేని ప్రత్యేకత దానిది. దేని ఉపయోగం దానికి ఉంటుంది. అలాగే మనుషులు కూడా ఉంటారని అర్థం చేసుకోవాలి. అప్పుడే మనుషుల్లో వ్యత్యాసాలు, భేదాభిప్రాయాలు తొలగి ఐక్యతాభావం ఆవిష్కరించబడుతుంది. అరటి చెట్టును సైతం చాలా చక్కగా ఆవిష్కరిస్తూ... జాతీయాలు, సామెతలకే పరిమి తం చేయకుండా అరటి చెట్టు గురించి గల పొడుపు కథలు సైతం పొందుపరిచారు. ఇలా ఆసాంతం అక్షర విన్యాసాల నడుమ భాషా సొగసులను, పాటలను కలగలిపి ఆకర్షణీయమైన శైలిలో తెలుగు భాష సొగసులు అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో వెలువరించిన ఈ 'తెలుగు ఒడి' పుస్తకం నిజంగా భాషా ప్రేమికుల పాలిట అమ్మ ఒడి అని చెప్పవచ్చు. 136 పేజీలూ, రూ.150 ధర ఉన్న ఈ పుస్తకం కోసం 98665 83907 నెంబర్లో సంప్రదించవచ్చు.

– డా. అమ్మిన శ్రీనివాసరాజు, 77298 83223

'సోమేపల్లి' పురస్కారాలకు చిన్న కథలకు ఆహ్వానం

తెలుగు చిన్న కథలకు సోమేపల్లి సాహితీ పురస్కారాలు అందించే నిమిత్తం ఈ ఏడాది కూడా కథల పోటీ నిర్వహించాలని సోమేపల్లి వారి కుటుంబం నిర్ణయించింది. అత్యుత్తమ కథకు రూ.2500, ఉత్తమ కథకు రూ.1500, మంచి కథకు రూ.1000, ప్రత్యేక బహుమతులు రూ.500 చొప్పున ఇద్దరికి ఇవ్వబడతాయి. కథల నిడివి రాతప్రతిలో రెండు నుంచి 4 పేజీలలోపు, డిటిపిలో 2 పుటలు ఉండాలి. ఒకరు ఎన్ని కథలైనా పంపవచ్చు. హామీపత్రంపై మాత్రమే రచయిత వివరాలు పేర్కొనాలి. కథలను సెప్టెంబర్ 30లోపు 'రమ్యభారతి, పి.బి.నెం.5, 11-57/1-32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ-520001' (సెల్ : 92474 75975) అనే చిరునామాకు పంపాలి. విజేతలకు నగదు బహుమతులతోపాటు, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానం ఉంటుంది.

– వశిష్ట సోమేపల్లి, చలపాక ప్రకాష్

ఎన్జీ రంగా సాహిత్య పురస్కారాలు 2025కు ఆహ్వానం

ఎన్జీ రంగా సాహిత్య పురస్కారాలు 2025కు రచయిత్రుల నుంచి కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు తెలిపారు. ఏ ప్రాంతంలో ఉన్న తెలుగు రచయిత్రులైనా 2021- 24 మధ్య ప్రచురించిన సంపుటాలను పోటీకి పంపవచ్చని చెప్పారు. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ. 5 వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. రచయిత్రులు తమ కథా సంపుటాలు 4 ప్రతులు చొప్పున ఆగస్టు 9లోగా 'డాక్టర్ నాగ భైరవ ఆదినారాయణ, 202 శ్రీ వెంకట సాయి రెసిడెన్సి, 2వ లైను, రామయ్య నగర్, ఒంగోలు – 523002, ఫోన్ నెంబర్ 98497 99711 పంపాలని కోరారు. నవంబర్ 7న గుంటూరులో జరిగే ఎన్జీ రంగా జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా విజేతలకు పురస్కార ప్రదానం ఉంటుందని, విజేతలు తప్పక హాజరు కావాలని తెలిపారు. వివరాలకు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు 98494 97739, డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు 93930 15584, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు 98483 51517 లకు సంప్రదించవచ్చు.

14న 'కొలిమి రాజెయ్యాల్సిందే!' పుస్తకావిష్కరణ సభ

ఈనెల 14వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం పౌర గ్రంథాలయం, రెండో హాలులో – కవి పతివాడనాస్తిక్ రచించిన 'కొలిమి రాజెయ్యాల్సిందే!' కవిత్వం పుస్తకావిష్కరణ సభ జరుగుతుంది. ఈ సభకు యుపిఎస్‌సి మాజీ సభ్యులు ప్రొఫెసర్ కెఎస్.చలం ముఖ్యఅతిథిగా పాల్గొంటారు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు. రెడ్డి రామక్రిష్ణ పుస్తక సమీక్ష చేస్తారు. ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించే ఈ సభలో అడపా రామక్రిష్ణ, ఎస్.హనుమంతరావు ఆప్తవాక్యం పలుకుతారు.

– ఉప్పల అప్పలరాజు, అరసం

18న 'ముంజూరు' కళింగాంధ్ర కవితా వార్షిక ఆవిష్కరణ

సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో 'ముంజూరు' కళింగాంధ్ర కవితా వార్షిక 2024 గ్రంథాన్ని శ్రీకాకుళం జిల్లా పలాస మండలం హరిపురంలో జులై 18వ తేదీన ఆవిష్కరించనున్నారు. నల్లి ధర్మారావు, దుప్పల రవికుమార్, వినోద్ కుత్తుం, సాంబమూర్తి లండ తదితరులు పాల్గొంటారు.

– సిక్కోలు బుక్స్, 99892 65444

20న భీమకవి చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ

కోయి కోటేశ్వరరావు సంపాదకత్వం వహించిన 'భీమకవి' చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ సభ జులై 20 వతేది ఆదివారం ఉదయం 10 గంటలకు యూటిఎఫ్ భవనం, కాకినాడలో జరుగుతుంది. నేలపూడి బాలరాజు అధ్యక్షత వహించే సభలో పొనుగుమట్ల విష్ణుమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ముఖ్య అతిథిగా కోరుకొండ బాబ్జీ, విశిష్ట అతిథులుగా శిఖామణి, జి.లక్ష్మీనరసయ్య, చోడగిరి లలితాదేవి, బండి సత్యనారాయణ, కొబ్బరాకు సుధాకర్, అద్దేపల్లి ప్రభు, మాకివీడి సూర్యభాస్కర్, నేలపూడి రత్నజీ తదితరులు పాల్గొంటారు

– రాజేష్, సవిలే ఫౌండేషన్, కాకినాడ

రాజ్యసభకు శ్రింగ్లా, మీనాక్షి, ఉజ్వల్, సదానందన్

- నామినేట్ చేసిన రాష్ట్రపతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభకు నలుగురు సభ్యులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నామినేట్ చేశారు. వీరిలో ఇద్దరు బిజెపి సభ్యులు కాగా, మరో ఇద్దరు బిజెపికి పరోక్షంగా అనుబంధంగా వ్యవహరించిన వారు. మాజీ దౌత్యవేత్త హర్షవర్ధన్ శ్రింగ్లా, చరిత్రకారిణి డాక్టర్ మీనాక్షి జైన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, బిజెపి నేత ఉజ్వల్ దేవరావు నికం, కేరళకు చెందిన బిజెపి నేత సి సదానందన్ మాస్టర్‌ను రాష్ట్రపతి నామినేట్ చేసినట్లు కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆదివారం పేర్కొంది. విదేశాంగ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా అమెరికా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్‌కు అంబాసిడర్‌గా పనిచేశారు. 2023లో ఇండియా జి-20 ప్రెసిడెన్సీకి చీఫ్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. చరిత్రకారిణి మీనాక్షి జైన్ 2020లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు.

ఉజ్వల్ దేవరావు నికమ్ 26/11 ముంబయి ఉగ్రదాడులతో సహా అనేక ఉన్నత స్థాయి క్రిమినల్ కేసుల విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నారు. 2024 ఎన్నికల్లో బిజెపి తరపున ముంబయి నార్త్ సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి వర్ష గైక్వాడ్ చేతిలో ఓటమి పాలయ్యారు. కేరళకు చెందిన బిజెపి నేత సి సదానందన్ త్రిసూర్‌లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. 2021 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేసి ఓడిపోయారు.

అటవీ హక్కుల చట్టం నిర్వీర్యం

- ఎఎఆర్ఎం సమావేశంలో బృందాకరత్
- ఆదివాసుల హక్కుల హరిస్తున్న మోడీ ప్రభుత్వం : బి వెంకట్
- జనగణనపై రాష్ట్రపతి, గవర్నర్లకు వినతులు ఇవ్వాలని నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకట్, చిత్రంలో బృందా కరత్ తదితరులు

అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం విధానాలను రూపకల్పన చేసి, అమలుకు యత్నిస్తోందని సిపిఎం సీనియర్ నేత బృందాకరత్ విమర్శించారు. ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం) కేంద్ర కమిటీ సమావేశాలు పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జరిగాయి. జనగణన పత్రంలో ఆదివాసులను అదర్స్ కాలమ్‌లో నమోదుకు సిద్ధం చేశారు. దీన్ని ఎఎఆర్ఎం సమావేశం తీవ్రంగా వ్యతిరేకించింది. అదర్స్ కాలమ్ స్థానంలో ఎస్‌టి అని పెట్టాలని రాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్లకు వినతులు ఇవ్వాలని సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా బృందాకరత్ మాట్లాడుతూ.. కార్పొరేట్ల కోసం అడవుల నుంచి ఆదివాసులను వెళ్లగొట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. టైగర్ జోన్లుగా ప్రకటించి, అక్కడి నుంచి ఆదివాసులను దూరం చేస్తున్నారని చెప్పారు. బ్రెజిల్‌లో పర్యావరణంపై జరిగిన సమ్మిట్‌లో ప్రధాని మోడీ మొక్కలు పెంచి, అడవులను విస్తరిస్తామని ప్రకటించారని, ఆచరణలో అందుకు విరుద్ధంగా అడవులను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించటం లేదని అన్నారు. అడవుల్లో బిజెపి, సంఘపరివార్ కార్యకలాపాలు పెరిగాయని, వాటికి అడ్డుకట్ట వేయాలని సూచించారు.

ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ.. ఆదివాసుల హక్కులను మోడీ ప్రభుత్వం హరిస్తోందని విమర్శించారు. రాజ్యాంగం షెడ్యూల్ 5, 6తో ఆదివాసులకు రాజ్యాంగ పరంగా హక్కులు, రక్షణ కల్పించిందని అన్నారు. మోడీ ప్రభుత్వం వాటిని భక్షించటమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. గ్రామ సభలు ఆమోదించిన లక్షల దరఖాస్తులకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వమే ఉల్లంఘనకు పాల్పడుతోందని విమర్శించారు. ఆదివాసీ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీలకు రాజ్యాంగం అంతిమ అధికారాలను ఇచ్చిందని, మోడీ సర్కారు వీటిని లెక్క చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో అటవీ ప్రాంతాల్లోని అపారమైన వనరులను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు, విదేశీ సంస్థలకు కట్టబెడుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి మిడియం బాబూరావు, కిల్లో సురేంద్ర, సచిన్, లోతా రామారావు, ధర్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జమ్ముకాశ్మీర్‌లో ఆంక్షలు

న్యూఢిల్లీ : 'కాశ్మీర్ అమరవీరుల దినోత్సవం' నిర్వహించకుండా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా యంత్రాంగం జమ్ముకాశ్మీర్‌లో ఆంక్షలు విధించింది. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు సహ ప్రతిపక్ష నేతలను గృహాల్లో నిర్బంధించింది. 1931 జులై 13న కాశ్మీర్‌లో రాజు హరిసింగ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ముస్లిం నిరసనకారులపై బ్రిటీష్ దళాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో 21మంది ప్రాణాలు కోల్పోయారు. వారి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది జులై 13న అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అటువంటి కార్యక్రమాలను నిర్వహించకూడదని ఎల్‌జి యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. శ్రీనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించింది. అమరవీరుల శ్మశాన వాటికకు వెళ్లేందుకు అనుమతి నిరాకరించింది.

వీరుల త్యాగాలను మరిచిపోలేం : సిఎం ఒమర్ అబ్దుల్లా

కాశ్మీర్ అమరవీరుల దినోత్సవం పాటించకుండా పలువురు నేతలపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా యంత్రాంగం విధించిన గృహనిర్బంధాలు, ఆంక్షలను ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం తీరు సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. "జులై 13న జరిగిన మారణహోమం జలియన్ వాలాబాగ్ లాంటిదే. అప్పట్లో కాశ్మీర్ బ్రిటీష్ నియంతృత్వం కింద ఉండేది. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన నిజమైన వీరులను ముస్లిములన్న కారణంతో నేడు విలన్లుగా చిత్రీకరించడం సిగ్గు చేటు. నేడు వారి సమాధులను సందర్శించే అవకాశం నిరాకరించారు. కానీ వారి త్యాగాలను మనం ఎన్నటికీ మరిచిపోలేం' అని ఆదివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.

అమరులకు నివాళులర్పించకుండా అడ్డుకున్నారు : తరిగామి

తనను గృహ నిర్బంధం చేశారని, తన నివాసం గేటుకు తాళం వేసి నిర్బంధించడం ద్వారా అమరులకు నివాళులర్పించే తమ హక్కును అడ్డుకున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, కుల్గాం ఎమ్మెల్యే ఎంవై తరిగామి సోషల్ మీడియాలో పేర్కొన్నారు. తన నివాసానికి తాళం వేసిన చిత్రాన్ని ఆయన పోస్ట్ చేశారు. 'ఈ రోజు మనందరి సమిష్టి జ్ఞాపకాలలో అజరామరంగా నిలిచిపోయిన రోజు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి, మన అందరికీ మంచి భవిష్యత్ ఇచ్చేందుకు తమ ప్రాణాలను అర్పించిన అత్యంత ముఖ్యులైన వారిని గుర్తు చేసే చారిత్రాత్మక రోజు' అంటూ ఆయన అమరులకు నివాళులర్పించారు. తరిగామిని, ఇతరులను గృహ నిర్బంధం చేయడం ద్వారా అడ్డుకోవడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది.

వారు ఎప్పుడూ మన హీరోలే : మెహబూబా ముఫ్తీ

"మహాత్మాగాంధీ నుంచి భగత్ సింగ్ వరకు కాశ్మీరీలు మీ హీరోలను స్వీకరించినట్లే మీరు మా హీరోలను మీ హీరోలుగా అంగీకరించిన రోజు" ప్రధాని మోడీ ప్రసంగించిన 'దిల్ కి దూరి' వాస్తవ రూపం దాల్చుతుందని పిడిపి నేత మెహబూబా ముఫ్తీ తెలిపారు. అమరుల సమాధులను సందర్శించకుండా ప్రజలను, నాయకులను వారి ఇళ్లలోనే నిర్బంధించడం శోచనీయమని అన్నారు. వారు ఎప్పటికీ మన హీరోలేనని అన్నారు. తనను గృహ నిర్బంధంలో ఉంచారని జమ్ముకాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సజాద్ లోని పేర్కొన్నారు.

ముడి చమురు రైలులో భారీ అగ్ని ప్రమాదం

పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం

చెన్నయ్ : తమిళనాడులో చెన్నయ్ సెంట్రల్‌కు 43 కిలోమీటర్ల దూరంలోని తిరువల్లూర్ సమీపంలో ఆదివారం ఉదయం ముడి చమురును రవాణా చేస్తున్న రైలులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో అనేక సబర్బన్, దూర ప్రాంత రైలు సర్వీసులను రద్దు చేయడమో లేదా నిలిపివేయడమో జరిగింది. ఫలితంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎన్నోర్ నుండి జోలార్‌పెట్టయ్‌కి ముడి చమురును రవాణా చేస్తున్న 45 బోగీల రైలు తెల్లవారుజామున 4.45 గంటలకు ప్రమాదానికి గురైంది. తిరువల్లూర్-ఎగత్తూర్ సెక్షన్ మీదుగా వెళుతుండగా ఒక్కసారిగా రైలులో మంటలు వ్యాపించాయి. రెండు వ్యాగన్లు పట్టాలు తప్పడంతో మంటలు చెలరేగి ఉండవచ్చునని ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. మంటలు తొలుత నాలుగు బోగీలకు, ఆ తర్వాత అత్యంత వేగంగా ఇతర బోగీలకు వ్యాపించాయి. సమీప ప్రాంతాలలో నివసిస్తున్న వారందరినీ ముందు జాగ్రత్త చర్యగా ఖాళీ చేయించారు. ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. మంటలు వ్యాపించకుండా ఐదు బోగీలను రైలు నుండి వేరుచేశారు. ప్రమాదం నేపథ్యంలో చెన్నయ్-అరక్కోణం మధ్య సబర్బన్ రైలు సర్వీసులను రద్దు చేశారు. మంగళూర్ మెయిల్, నీలగిరి ఎక్స్‌ప్రెస్, కోయంబత్తూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను వివిధ స్టేషన్లలో నిలిపివేశారు. చెన్నయ్-మైసూర్ శతాబ్ది, చెన్నయ్-బెంగళూరు డబుల్ డెక్కర్ సహా చెన్నయ్ సెంట్రల్ నుండి బయలుదేరాల్సిన రైళ్లనన్నింటినీ రద్దు చేశారు. మరో నాలుగు రైళ్లను గూడూరు, రేణిగుంట మీదుగా దారి మళ్లించారు.

కేరళ సిఎం విజయన్ నివాసానికి బాంబు బెదిరింపు

- నకిలీ ఇ-మెయిల్‌గా ప్రకటన



తిరువనంతపురం : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు వచ్చింది. తంపనూరు పోలీస్ స్టేషన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఇ-మెయిల్ పంపారు. క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయంటూ ఇ-మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయన నివాసంలో విస్తృతంగా తనిఖీలు చేసి.. అది నకిలీ ఈ-మెయిల్‌గా తేల్చారు. "బాంబు బెదిరింపు తర్వాత ముఖ్యమంత్రి నివాసాన్ని డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాం. ఎక్కడా అనుమానాస్పదంగా కనబడలేదు" అని పోలీసులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపుల నేపథ్యంలో తాజాగా వచ్చిన ఇ-మెయిల్‌కు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

DBS

వేలం ప్రకటన

[illegible]
https://egold.auctiontiger.net [illegible]

48237177	[illegible]	[illegible]	50.40	50.40
56836278	[illegible]	[illegible]	12.00	11.50
56835695	[illegible]	[illegible]	11.60	11.20
56837365	[illegible]	[illegible]	20.30	16.50

తేది : 10.07.2025 [illegible]

బహిరంగ మార్కెట్ అమ్మకాలకు రిజర్వ్ ధరలు పెంపు

- గోధుమలు 10.86 శాతం, బియ్యం 3 శాతం పెరుగుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బహిరంగ మార్కెట్ అమ్మకాలకు రిజర్వ్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గోధుమల ధర 10.86 శాతం, బియ్యం ధర 3 శాతం పెంచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఓపెన్-మార్కెట్ సేల్ స్కీమ్-డొమెస్టిక్ (ఒఎంఎస్ఎస్-డి) కింద అమ్మకానికి ఉన్న గోధుమ, బియ్యం రిజర్వ్ ధరలను పెంచింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వశాఖ ఉత్తర్వులిచ్చింది. దీని ప్రకారం, 2025-26 రబీ మార్కెటింగ్ సీజన్‌తో సహా అన్ని పంట సంవత్సరాల గోధుమలను ఇ-వేలంతో ఎన్ఎఎఫ్ఇడి, ఎన్‌సిసిఎఫ్, కేంద్రీయ భండార్ వంటి కేంద్ర సహకార సంస్థలకు భారత్ బ్రాండ్ కింద సొంత దుకాణాలు, మొబైల్ వ్యాన్లు, ఇ-కామర్స్/పెద్ద గొలుసు రిటైలర్ల ద్వారా విక్రయించనుంది. కమ్యూనిటీ కిచెన్‌లకు విక్రయించడానికి రిజర్వ్ ధర క్వింటాలుకు రూ.2,550గా నిర్ణయించింది. ఈ ధరలు 2026 జూన్ 30 వరకు అమలులో ఉంటాయని మంత్రిత్వశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. రవాణా ఖర్చు రిజర్వ్ ధరకు చేర్చబడుతుందని తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్ణయించిన గోధుమ నిల్వ ధర గత ఆర్థిక సంవత్సరం (2024-25) క్వింటాలుకు రూ.2,300తో పోలిస్తే 10.86 శాతం ఎక్కువగా ఉంటుంది. ఆహార, ప్రజా పంపిణీశాఖ (డిఎఫ్‌పిడి) గోధుమల రిజర్వ్ ధరను నిర్ణయించినప్పటికీ, ఓపెన్ - మార్కెట్ అమ్మకపు పథకంతో ఎంత పరిమాణంలో విక్రయించాలో ప్రకటించలేదు.

కాల్పులు విరమించండి

- టెల్ అవీవ్‌లో భారీ నిరసన
- గాజాలో చిన్నారుల మరణాలపై మౌన ప్రదర్శన

టెల్ అవీవ్‌లో ప్రదర్శన చేస్తున్న ప్రజలు

టెల్ అవీవ్ : ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు అంతర్జాతీయ సమాజం నుంచే కాదు.. స్వంత దేశంలో కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. గాజాపై ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమానికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ రాజధాని టెల్‌అవీవ్‌లో ప్రజలు ఆందోళనలు చేశారు. ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల కారణంగా గాజాలో మరణించిన చిన్నారుల కోసం వారు మౌనప్రదర్శనను నిర్వహించారు. మరణాల సంఖ్య పెరుగుతున్నందున కాల్పులను విరమించాలని వారు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ దాడులలో చనిపోయిన పిల్లల పట్ల నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లకార్డులను చేతబట్టుకొని నిరసనను తెలియజేశారు. ఈ ఆందోళనల్లో మహిళలతో పాటు వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. కాల్పులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పుల్లో శనివారం 31 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని పాలస్తీనా అధికారులు చెప్పారు. ఇజ్రాయిల్ వైమానికదాడుల్లో 28 మందికి పైనా చనిపోయారనీ, ఇందులో నలుగురు చిన్నారులూ ఉన్నారని తెలిపారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి 57,762 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇందులో సగం మందికి పైగా చిన్నారులు, మహిళలే ఉన్నట్టు వివరించింది. 2023, అక్టోబర్ నుంచి గాజాపై ఇజ్రాయిల్ తీవ్రంగా విరుచుకుపడుతున్నది. హమాస్ టార్గెట్‌గా చర్యలు తీసుకుంటున్నామని చెప్తూనే.. సామాన్య ప్రజలపై విరుచుకుపడుతున్నది.

ఇరాన్ అధ్యక్షుడి హత్యకు ఇజ్రాయిల్ యత్నం!

టెహరాన్ : బీరుట్‌లో హిజ్బుల్లా నాయకుడు నస్రల్లాను హత్య చేసినట్లే ఇరాన్ అధ్యక్షుడిని హత్య చేసేందుకు ఇజ్రాయిల్ ప్రయత్నించిందని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జిసి)కి సంబంధించిన వార్తా సంస్థ పేర్కొంది. జూన్ 16న టెహరాన్‌లోని ఓ భవనంలో నిర్వహించిన ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగర్ గాలిబాఫ్, న్యాయవ్యవస్థ చీఫ్ మొహ్సేని ఎజి, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారని వార్తాసంస్థ తెలిపింది. వారంతా సమావేశంలో ఉన్న సమయంలో ఆ భవనంపై ఇజ్రాయిల్ వైమానిక దాడులకు పాల్పడిందని వార్తాసంస్థ వెల్లడించింది. వారు తప్పించుకునే వీలు లేకుండా భవనానికి ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌లను లక్ష్యంగా చేసుకొని.. ఆరు క్షిపణులను ప్రయోగించిందని విమర్శించింది. దాడులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ నాయకులు, అధికారులు ముందుగానే సిద్ధం చేసుకున్న అత్యవసర హాచ్ ద్వారా తప్పించుకోగలిగారని తెలిపింది. అక్కడి నుంచి తప్పించుకుంటున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ సహా పలువురు ఉన్నతాధికారులకు గాయాలైనట్టు తెలిపింది.

TATA
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
[illegible] CIN No.U67190MH2008PLC187552 [illegible]
[illegible]

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

మోపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెకి ఒప్పందానికి వ్యతిరేకంగా తనతో పాటు ప్రస్తుత ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోర్టులో కేసులు వేశారని గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం గమ్మున ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలకొట్టాలని పిలుపునిచ్చిన మంత్రి నారా లోకేష్ అధికారంలోకి రాగానే బిగిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లపై అదానికి టిడిపి లొంగిపోయిందని, సెకి ఒప్పందానికి ఈ ప్రభుత్వం కొమ్ము కాస్తుందని విమర్శించారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ అదాని హబ్‌గా మారిపోతుందని విమర్శించారు. అదానితో జరిగిన సెకి ఒప్పందం ఘోరమని, ఏ రాష్ట్రంలోనూ ఇలా జరగలేదన్నారు. అధికారంలోకి వస్తే ఛార్జీలను పెంచబోమని చెప్పి రూ.15 వేలకోట్లు భారం ప్రజలపై టిడిపి మోపిందన్నారు. ట్రూడౌన్ పేరుతో ఛార్జీలను తగ్గిస్తున్నామని ప్రజల్లో భ్రమ కల్పిస్తున్నారని చెప్పారు. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు చేసే ఆందోళనకు తమ మద్దతు ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సంస్కరణలు రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. పార్లమెంట్‌లో ఆమోదం లేకుండా వీటిని ఎలా అమలు చేస్తారని నిలదీశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు అదాని కార్యాలయంలో, మూడు నల్ల వ్యవసాయ చట్టాల బిల్లు అంబాని కార్యాలయంలో రూపొందించారని విమర్శించారు. ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ.. విద్యుత్ సంస్కరణలపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వీటిని ఏడు రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని, అందులో నాలుగు మోడీకి అనుకూలంగా ఉన్నవేనని తెలిపారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరో బషీర్‌బాగ్ ఉద్యమాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్‌యుసిఐ(యు) నాయకులు గోవిందరాజులు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ.. మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు ప్రజలను దగా చేస్తున్నాయని విమర్శించారు. ఆర్ఎస్‌పి నాయకులు జానకీ రాములు, ఫ్యాక్స్ నాయకులు మురళీకృష్ణ తదితర నాయకులు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిర్మించబోయే ప్రజా ఉద్యమాన్ని వాడవాడలా తీసుకెళ్లాలని తెలిపారు.

భారాలు రద్దు చేయాలి : సదస్సు తీర్మానం

వినియోగదారులపై మోపిన ట్రూఅప్, ఇంధన సర్దుబాటు, తదితర విద్యుత్ ఛార్జీల భారాలను రద్దు చేయాలని సదస్సు తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సిహెచ్ బాబూరావు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సదస్సు ఆమోదించింది. గత సంవత్సరం ప్రజలపై వేసిన అదనపు భారాలు రూ.15,526 కోట్లు రద్దు చేయాలని డిమాండ్ చేసింది. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం ఆపాలని, బిగించిన మీటర్లను వెంటనే తొలగించాలని తీర్మానించింది. పెంచిన విద్యుత్ సుంకాన్ని తగ్గించాలని డిమాండ్ చేసింది. 2024-25 సంవత్సరంలో అదనంగా వసూలు చేసిన రూ.2,787 కోట్లను వెంటనే తిరిగి చెల్లించాలని, వినియోగదారులపై అదనంగా వసూలు చేసే యూనిట్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలో ఉన్న 2 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చింది.

భవిష్యత్ కార్యాచరణ ప్రకటన

ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని సదస్సు పిలుపునిచ్చింది. 17 నుంచి 22 వరకు పట్టణ, మండల సదస్సులు, 23 నుంచి 29 వరకు ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, 30 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు వీధి/కాలనీ సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలని కోరింది. ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని పిలుపునిచ్చింది.

బలవంతంగా 'నానో' ఎరువులు అమ్మొద్దు

- రైతుల ఆందోళనతో దిగొచ్చిన కేంద్రం
- రాష్ట్రాలకు లేఖ

న్యూఢిల్లీ : నానో ఎరువుల అమ్మకాలకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. నానో ఎరువులు, బయోస్టిమ్యులెంట్లను బలవంతంగా రైతులకు అమ్మడాన్ని తక్షణమే నిలిపివేయాలని రాష్ట్రాలకు కేంద్రం లేఖ రాసింది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఈమేరకు లేఖ రాశారు. యూరియా, డిఎపి వంటి సబ్సిడీపై లభించే సాంప్రదాయ ఎరువుల స్థానంలో రైతులకు బలవంతంగా నానో ఎరువులను విక్రయించవద్దని లేఖలో మంత్రి స్పష్టం చేశారు. నానో ఎరువులు కొనుగోలు చేయకపోతే రైతులకు సాంప్రదాయ ఎరువులను విక్రయించడం లేదని వస్తున్న ఫిర్యాదులను మంత్రి ప్రస్తావించారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ, నాసిరకం ఎరువుల అమ్మకాలపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయించడం, సబ్సిడీ ఎరువుల మళ్లింపు వంటి కార్యకలాపాలను రాష్ట్రాలు కఠినంగా పర్యవేక్షించాలని, వాటిపై వేగంగా చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఎరువుల ఉత్పత్తి, అమ్మకాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని రాష్ట్రాలకు సూచించారు. నానో ఎరువుల విక్రయాలు పెంచాలన్న కేంద్రం నిర్ణయంపై దేశవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేశారు.

కావాల్సింది సారీ కాదు... న్యాయం

- తమిళనాడులో లాకప్‌డెత్‌లపై విజయ్ ఆగ్రహం

చెన్నై : తమిళ నటుడు విజయ్ సారథ్యంలోని టివికె రాజకీయ పార్టీగా అవతరించిన తర్వాత తొలిసారి ఆందోళన కార్యక్రమం చేపట్టింది. నల్ల చొక్కా ధరించి నిరసనలో పాల్గొన్న టివికె అధినేత విజయ్, స్టాలిన్ సర్కార్‌పై విమర్శలు కురిపించారు. 'ఖాళీ, పబ్లిసిటీ' డిఎంకె సర్కార్ ఇప్పుడు 'సారీ మోడల్‌'గా మారిపోయిందని అన్నారు. నాలుగేళ్ల డిఎంకె పాలనలో 24 లాకప్ డెత్‌లు జరిగాయని ఆరోపించారు. వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'ప్రభుత్వం నుంచి మనకు ఎక్కువగా సారీ అనే సమాధానమే వస్తోంది. అన్నా యూనివర్సిటీ కేసు నుంచి అజిత్ కుమార్ కేసు వరకు మీ పాలనలో ఇంకా ఎన్ని దారుణాలు చూడాలి? అజిత్ కుమార్ పేద కుటుంబం నుంచి వచ్చిన యువకుడు. ఈ ఘటన తర్వాత సిఎం స్టాలిన్ సారీ చెప్పారు. మీ హయాంలో మొత్తం 24మంది కస్టడీలోనే మరణించారు. మరి మిగతా 23మందికి కూడా క్షమాపణలు చెప్పాలి. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించాలి' అని విజయ్ డిమాండ్ చేశారు.

కెనరా బ్యాంక్ Canara Bank
[illegible]
[illegible]

చిన్నారి

నిర్లక్ష్యం



వసంతవాడలో సుబ్బయ్య, పుల్లయ్య అనే ఇద్దరు మిత్రులు ఉన్నారు. సుబ్బయ్య నిర్లక్ష్యంగా ఉంటాడు, పుల్లయ్య అతి జాగ్రత్తగా వ్యవహరిస్తాడు.

ఒక రోజు సుబ్బయ్య ఇంటి పక్కన అగ్నిప్రమాదం జరిగింది. జనం మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తుంటే, సుబ్బయ్య మాత్రం, 'ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావిడి' అంటూ దాన్ని పట్టించుకోకుండా పొలానికి బయల్దేరాడు. దారిలో పుల్లయ్య ఇంటి దగ్గర ఆగాడు. గుమ్మంలో సుబ్బయ్యని చూసిన పుల్లయ్య ఆశ్చర్యపోయి, 'నీ ఇంటి పక్కన మంటలు చెలరేగుతుంటే ఇంత నిర్లక్ష్యంగా పొలానికి ఎలా వెళ్తున్నావు? మీ బజారులో మంటలు లేస్తే, నా ఇంటికి అంటుకుంటాయని ఇందాకటి నుండి మా ఇంటిని తడుపుకుంటున్నాను' అన్నాడు.

సుబ్బయ్య నవ్వి, 'ఇంత అతి జాగ్రత్త పనికిరాదు. అందుకే నిన్ను అందరూ పిచ్చి పుల్లయ్య అంటుంటారు' అని ఎగతాళి చేశాడు. అంతలో సుబ్బయ్య కొడుకు నరేష్ పరుగెత్తుకుంటూ వచ్చి, 'నాన్నా, మన ఇంటికి నిప్పంటుకుంది, తొందరగా రా' అని ఏడుస్తూ చెప్పాడు.

ఇల్లు కాలుతోందని తెలియగానే సుబ్బయ్య గుండెల్లో రాయి పడ్డట్టయ్యింది. పుల్లయ్యతో సహా ముగ్గురూ అక్కడికి చేరుకున్నారు. కాలిపోతున్న ఇంటిని చూసి సుబ్బయ్య బోరున విలపించాడు.

పుల్లయ్య సుబ్బయ్యను ఓదార్చుతూ, 'నా అతి జాగ్రత్త వలన శ్రమ వృధా అయ్యింది గానీ, నీ నిర్లక్ష్యం వలన ఎంత అనర్థం జరిగిందో చూడు. ఇకనైనా జాగ్రత్తగా ఉండటం నేర్చుకుందాం' అన్నాడు.

- డా.పోతగాని సత్యనారాయణ,
ఖమ్మం, 91825 31202.

చిట్టి చీమలు

పుట్ట పొట్టలో కుప్పలు కుప్పలు
చిన్ని పొట్టకు నిరంతర తిప్పలు
పుట్టలో చేరు తెప్పలు తెప్పలు!

శ్రమ విభజన సాంకేతిక నిపుణులు
శ్రమ సౌందర్య సాధన ప్రవీణులు
శ్రమ జీవన విధాన శైలి ప్రాణులు!

సంఘ జీవికి జీవన బాటలు
సహకార జీవన నవ పథాలు
సామ్యవాద జీవన సంకేతాలు!

క్రమశిక్షణ కాలానుగత సారిణి
కూడబెట్టు ముందు చూపు ధోరణి
కరువు క్షుద్బాధల నివారిణి!

పుట్టలో వేలు పెడితే కుట్టి పెట్టు
పెద్ద పాము నైనా మట్టు పెట్టు
చిట్టి చీమలు మనసును కట్టి పెట్టు!

- పట్లోళ్ళ బక్కారెడ్డి, 97053 15250.

నేను గీసిన బొమ్మ

బండారి నిస్సి
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నిజాంపేట,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

మన ఆలోచనా సరళే..
మనం చేసే పనులను
నిర్ణయిస్తుంది.

మీ కోసం

చిటికెడు పసుపుకు ఏదేని ఫేస్ పౌడర్ ఒక చెంచా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని వంటగదిలో ఉండే నూనె సీసాలు, పచ్చళ్ల జాడీలు, మొక్కల కుండీల మధ్య చల్లినట్లైతే చీమలు, ఈగలు చేరకుండా ఉంటాయి.

JEEVANA
జీవన the family

రోగ నిరోధకతను పెంచే ఆహారమే మేలు

వేసవిలో ఎండ వేడి తగలకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నామో.. వర్షాకాలంలోనూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. వర్షాకాలంలో చిటపట చినుకుల మధ్య వేడివేడిగా ఏమైనా చిరుతిళ్లు తినాలనిపిస్తుంది. కానీ.. శరీరానికి పోషకాలు అందించే, రోగనిరోధక శక్తిని పెంచే ఆహారం, పండ్లు తినడం ఉత్తమం. పైగా ఇది సీజన్ మారటంతో జ్వరం, జలుబు, అలర్జీ, ఇన్‌ఫెక్షన్, అజీర్ణ సమస్యలు ఎక్కువగా ఉంటాయి. వీటినుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే శరీరానికి శక్తి అవసరం. వ్యాధినిరోధక శక్తి అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో మన ఆరోగ్యానికి ఎంతో అవసరం కూడా. అందుకు తినాల్సిన పండ్ల గురించి తెలుసుకుందాం.

నేరేడు: సీజనల్‌గా వర్షాకాలంలో నేరేడు పండ్లు విరివిగా లభిస్తున్నాయి. వీటిలో కేలరీలు తక్కువ. ఇనుము, ఫోలేట్, పొటాషియం, విటమిన్లు ఎక్కువగా ఉండటంతో బరువు తగ్గాలనుకునే వారికి ఇవి మంచి చాయిస్. అజీర్తిని తగ్గిస్తాయి కూడా.

చెర్రీస్ : వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే పండ్లలో చెర్రీస్ ఒకటి. యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే పండ్లు ఇవి. మెదడుపై ఒత్తిడి తగ్గించి ప్రశాంతత కలిగేలా చేస్తాయి. ఇన్ ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది.

అరటిపండ్లు : విటమిన్స్ ఎక్కువగా ఉండే అరటిపండు ఎంతో ఆరోగ్యం. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్తి సమస్యలను పోగొడుతుంది. పిల్లలకు అరటిపండ్లు చాలా మంచివి. రోజుకో పండైనా తినిపించాలి. దీంతో శరీరానికి శక్తి లభిస్తుంది.

యాపిల్ : వర్షాకాలానికి తగ్గట్టు శరీరంలో యాక్టివ్ నెస్ కాస్త నెమ్మదిస్తుంది. దీంతో శరీరంలో జరిగే జీవక్రియ వేగం కూడా తక్కువగా ఉంటుంది. వీటిని అధిగమించేందుకు యాపిల్ పండు ఉత్తమం.

రేగు : వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. ఫ్లూ, జలుబు వంటి ఇన్ ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది.

దానిమ్మ: ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. రక్తం పడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పిల్లల నుంచి పెద్దల వరకూ రోజుకొక పండైనా తింటే ఆరోగ్యంగా ఉంటారు.

బొప్పాయి : విటమిన్ 'సి' అధికంగా లభించే పండు బొప్పాయి. ఆరోగ్యానికి ఎంతో మంచిది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వర్షాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. ఇందులో పీచు పదార్థం ఎక్కువ. కాస్త మితంగా తీసుకోవడం ఉత్తమం.

పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే..

తగినంతగా నీరు (హైడ్రేషన్) : వర్షాకాలంలో తగినంత నీరు త్రాగాలి. తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పటికీ శరీరానికి నీరు అవసరం. వర్షం వల్ల వచ్చే అధిక తేమ కారణంగా డీహైడ్రేట్‌కు కారణం అవుతుంది. రోజూ కనీసం ఎనిమిది గ్లాసుల నీళ్లు తాగడం ద్వారా హైడ్రేట్‌గా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు.

కషాయాలు, డ్రింక్స్: వర్షాకాలంలో అల్లం, హెర్బల్ టీలు, సూప్‌లు తాగాలి. ఇవి శరీరాన్ని వెచ్చగా ఉంచుతాయి. అంతేకాకుండా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. గ్రీన్ టీ, చమోమిలే హెర్బల్ టీలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

సీజనల్ ఫ్రూట్స్: సీజన్‌లో లభించే పండ్లను తినాలి. యాపిల్స్, బేరి, దానిమ్మ, నారింజ పళ్లలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పండ్లు ఆరోగ్యకరమైన రోగ నిరోధక వ్యవస్థను పెంచుతాయి. ఇన్‌ఫెక్షన్లను నిరోధిస్తాయి.

విటమిన్ సి: రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహారంలో విటమిన్ సి ఉండే ఆహారాన్ని తినాలి. నిమ్మకాయలు, నారింజ పండ్లు, ద్రాక్ష పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. బ్రకోలీ, బెల్ పెప్పర్స్, కివీస్‌లో కూడా విటమిన్ సి సమద్ధిగా ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధుల నుంచి కాపాడుతాయి.

సమతుల భోజనం : వర్షాకాలంలో తేలికపాటి, సమతుల ఆహారం తీసుకోవాలి. లీన్ ప్రోటీన్స్, తణధాన్యాలు కలిసి ఉండే భోజనాన్ని తినాలి. వోట్స్, క్వినోవా, బ్రౌన్ రైస్ వంటివి తినాలి. చికెన్, చేపలు, టోఫు వంటి లీన్ ప్రోటీన్స్ ద్వారా కండరాలు పెరుగుతాయి. కూరగాయలలో ఉండే ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

ఉల్లిపాయలు, వెల్లుల్లి : వెల్లుల్లి, ఉల్లిపాయలు సహజంగా యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. ముఖ్యంగా, వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల నుంచి ఇవి రక్షిస్తాయి.

స్ట్రీట్‌ఫుడ్స్ వద్దు : వర్షాకాలంలో బయటి ఫుడ్స్ తినకుండా ఉండటం మేలు చేస్తుంది. వాతావరణ మార్పుల కారణంగా బయటి ఫుడ్స్ ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతాయి.

కలుషిత ఆహారాన్ని తినొద్దు

మనం తీసుకునే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. శరీరానికి సరైన పోషకాలు అందించకపోతే చాలా రకాల ఇబ్బందులు తలెత్తుతాయి. ఏటేటా ప్రపంచ వ్యాప్తంగా కలుషిత ఆహారం సమస్య తీవ్రమవుతోంది. ప్రపంచ జనాభాను కలుషిత ఆహారం తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. మన దేశంలో 527 రకాల ఆహారాలు కలుషితం అవుతున్నాయని వివిధ నివేదికలు పేర్కొంటున్నాయి. అసలు ఆహారం కలుషితం అంటే ఏమిటి? ఎన్ని రకాలు? తీసుకోవాల్సిన నివారణ చర్యలేమిటో తెలుసుకుందాం..

ఆహారం ఎలా కలుషితం అవుతుందంటే...

ఆహార ఉత్పత్తుల్లోకి బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు, రసాయనాలు లేదా టాక్సిన్లు వంటి హానికరమైన పదార్థాలు,జీవులు ప్రవేశిస్తూ అవి కలుషితమవుతాయి. ప్రాసెసింగ్, రవాణా, స్టోరేజ్ వంటి ఏదో ఒక దశలో ఆహార ఉత్పత్తులు కలుషితం అవుతున్నాయి. మనదేశంలో కలుషితమవుతున్న ఆహారాల జాబితాలో ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాల ఉత్పత్తులు, మాంసం, సుగంధ ద్రవ్యాలు, ప్యాక్డ్ స్నాక్స్ వంటివి ఉన్నాయి. ఈ ఆహారాలు వివిధ రోగ కారకాలు లేదా రసాయనాలతో కలుషితం కావొచ్చు. వీటిని ఆహారంగా తీసుకుంటే రోగాల తీవ్రత పెరుగుతుంది.

పరిశుభ్రత పాటించకపోవటమే కారణం

ఆహారం కలుషితం కావటానికి అనేక కారణాలున్నాయి. పారిశుధ్యం లేకపోవటం, సరైన పరిశుభ్రత పద్ధతులు పాటించకపోవటం, ఫుడ్ ప్రాసెసింగ్ సరిగ్గా చేయకపోవటం, నిల్వ, రవాణా సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవటం కూడా ప్రధాన కారణాలే. అలాగే పురుగు మందుల అధిక వినియోగం వల్ల కూడా ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయి.

రకరకాలుగా ప్రచార మోత!

'టికెట్ కొట్టు.. ఐఫోన్ పట్టు' పేరుతో ఆడియన్స్‌కు వర్జిన్‌బాయ్స్ (యువతకు మాత్రమే ట్యాగ్‌లైన్) మూవీ టీమ్ క్రేజీ ఆఫర్‌ను ఇచ్చింది. జులై 11న ఈ సినిమా టిక్కెట్లు కొన్న 11 మందికి ఐఫోన్లు గిఫ్ట్‌గా ఇచ్చింది. మనీ రెయిన్ ఇన్ థియేటర్స్ అనే కాన్సెప్ట్‌తో కొన్ని థియేటర్లలో మీపై వర్షంలా డబ్బులు కురుస్తాయని వాటిని సొంతం చేసుకోవచ్చునని ఆ సినిమా నిర్మాత రాజా దారపునేని ప్రకటించారు.

జనాన్ని థియేటర్లకు రప్పించాలంటే చిన్న సినిమా నిర్మాతలకు తల ప్రాణం తోకలోకి వస్తోంది. ఎంత వెరైటీగా ప్రమోషన్లు చేసినా సరే చాలా చోట్ల మార్నింగ్ షో వేయించడం పెద్ద సవాల్‌గా మారింది. మొదటి రోజు మొదటి ఆటకు కనీసం పది మంది లేక బుకింగ్ కౌంటర్లు మూసేస్తున్న దాఖలాలు ఈ మధ్య ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో, 'వర్జిన్ బాయ్స్' టీమ్ ప్రచారానికి కొత్త ఎత్తు వేసింది. టికెట్లు కొన్నవాళ్ళలో పదకొండు మందికి లక్కీ డ్రా ద్వారా ఐఫోన్లను ఇస్తామని, షో రన్ అవుతున్న టైంలో పై నుంచి డబ్బులు వెదజల్లుతామని ప్రచారంలో పెట్టింది. నోట్లు విసిరే ప్రక్రియ ఆహ్వానించదగింది కాదు. ప్రేక్షకులు నోట్ల కోసం గొడవలు పడే ప్రమాదం ఉండొచ్చు.

ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించే ఇలాంటి ప్రచార వ్యూహాలు గతంలోనూ నడిచాయి. బెనిఫిట్ షో ఉచితంగా ప్రదర్శించడం, మహిళలకు ఫ్రీ ఆటలు, ఒక టికెట్ కొంటే మరొకటి ఫ్రీ, విలన్ ఎవరో కనుక్కుంటే రూ.10 వేల గిఫ్ట్. రూ.100.కే బాల్కనీ ... ఇలా రకరకాలుగా ఆడియెన్స్‌ని రప్పించే ప్రయత్నాలు చాలా జరిగాయి.

'వర్జిన్ బాయ్స్'తోపాటు పాటు సుహాస్ 'ఓ భామ అయ్యో రామా' ఈనెల 11న విడుదలయ్యాయి. ఈనెల 24న పవన్ కళ్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' విడుదల కానుంది. ఈ లోగా రెండు వారాల గ్యాప్‌లో ఐఫోన్, డబ్బులు విసిరే కార్యక్రమాలను చేపడతామని నిర్మాతలు ప్రకటించారు.

సరికొత్తగా ప్రచారకార్యక్రమాలు

'మార్కెట్లో మన సినిమా పేరు మార్మోగిపోవాలా..' అనేది టాలీవుడ్‌లో సరికొత్త ట్రెండ్. కాస్త ఆగి ఓటీటీలో చూసేద్దాంలే అనుకొనే ప్రేక్షకులను తొలిరోజే థియేటర్లకు పరుగులు పెట్టించాలంటే సరికొత్త ప్రచారంతో ఆసక్తి పెంచాలని దర్శక, నిర్మాతలు భావిస్తున్నారు. ఇదివరకటిలా రిలీజ్ డేట్ ప్రకటనల పోస్టర్లు, ప్రీ రిలీజ్ ఫంక్షన్లు, టీజర్లు, ట్రైలర్లు, ప్రమోషనల్ ఇంటర్వ్యూలకు మాత్రమే పరిమితం కావటం లేదు. అంతకుమించిన కంటెంట్‌ను ఎప్పటికప్పుడు సినీ ప్రియులకు వడ్డిస్తున్నారు. అసలు పాటలను తలదన్నే స్థాయిలో కవరు సాంగులు వస్తున్నాయి. మేకింగ్ వీడియోలు యూట్యూబ్‌ను షేక్ చేస్తున్నాయి. హీరోలే లీకువీరులై కొన్ని సీన్లను రివీల్ చేస్తూ అసలు సినిమా ముందుంది అంటూ ఊరిస్తున్నారు. ఇలా ప్రచారపర్వం రోజురోజుకూ కొత్త పోకడలు పోతోంది.

క్లాప్ నుంచే క్లాప్స్ వరకూ...

సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు చిత్ర బృందాలు తెగ శ్రమిస్తున్నాయి. సినిమాకే కాదు.. వాటి ప్రమోషన్లకూ పక్కా స్క్రిప్టులు రాస్తున్నాయి. సినిమాకు క్లాప్ కొట్టకముందు నుంచే జనాల నోళ్లలో నానాలి. పేరు పెట్టకముందే ట్రెండింగ్‌లో ఉండాలి. అందుకోసమే కొత్త సినిమా అనౌన్స్‌మెంట్ మొదలుకొని ప్రధాన తారాగణం, సాంకేతిక నిపుణుల పేర్లను వెల్లడించడం వరకూ సృజనాత్మకంగా ఆలోచిస్తున్నారు. ఫలానా హీరో ఫలానా దర్శకుడితో సినిమా చేస్తున్నాడహో అంటూ మొక్కుబడి ప్రకటనలు విడుదల చేయకుండా కాన్సెప్టులు అల్లుకొని మరీ ప్రత్యేక వీడియోలు రూపొందిస్తున్నారు.

ట్రెండింగ్ కోసమే...

గతంతో పోలిస్తే సామాజిక మాధ్యమాల వేదికగా సినిమా విషయాల ప్రచారం విస్తృతంగా సాగుతోంది. తాజాగా దర్శకుడు రాజమౌళితో తెరకెక్కిస్తున్న మహేష్‌బాబు చిత్రంలోనూ ఇలాంటి విషయాలు జోరుగా అడపా దడపా బయటకు వస్తున్నాయి. ఎన్టీఆర్ నటించిన 'వార్ 2', బాలకృష్ణ 'అఖండ 2', పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు', చిరంజీవి 'విశ్వంభర', రామ్‌చరణ్ నటిస్తున్న 'పెద్ది', అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటిస్తున్న సినిమాల గురించి ప్రచార హోరు కొనసాగుతోంది. నాని, ప్రభాస్, విజయ్ దేవరకొండతో పాటుగా చిన్నా, పెద్దా కథానాయకులు అనేది లేకుండా ఏ సినిమాకైనా ఇలాంటి ప్రమోషన్లకు ఇష్టపడుతున్నారు. సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా గురించి దర్శకుడు అనిల్ రావిపూడి ఈ తరహా ప్రచారాన్ని జోరుగా సాగించారు.

అంచనాలు పెంచేలా పాటల విడుదల

పాటలు బాగుంటే సినిమా సగం విజయం సాధించినట్లే అన్నది పరిశ్రమకు చెందిన వారి విశ్వాసం. అందుకే తమ సినిమా పాటలు జనాలకు చేరువ కావడం కోసం ఆడియో రిలీజ్ వేడుకను పెద్ద ఎత్తున నిర్వహించి అదేరోజున పాటలన్నింటినీ విడుదల చేసేవారు. ఆ సంప్రదాయం కాలగర్భంలో కలిసిపోయింది. ఒక్కో పాటను ఒక్కోసారి వదులుతూ సినిమాపై క్రమక్రమంగా అంచనాలు పెంచుకుంటూ పోవడం ఇప్పటి ట్రెండ్. అయితే పాటను లిరికల్ వెర్షన్ రూపంలో విడుదల చేయడం కూడా ఇప్పుడు పాతబడిపోయింది. కొత్తగా కవర్ సాంగులు పుట్టుకొచ్చాయి. ఖర్చుకు వెనకాడకుండా భారీ హంగులతో వీటిని చిత్రీకరిస్తున్నారు. వీటిలో సంగీత దర్శకులు హీరోలకు ఏమాత్రం తీసిపోని రీతిలో ప్రత్యేక కాస్ట్యూమ్స్ ధరించి జోరుగా స్టెప్పులేస్తూ జోష్ నింపుతున్నారు.

ధరల మోతే...

టాలీవుడ్‌లో స్టార్ హీరోలు నటించిన భారీ బడ్జెట్ సినిమాలకు మాత్రమే పెయిడ్ ప్రీమియర్స్, టికెట్ ధరలు పెంపు నిర్ణయం అమలవుతూ వస్తోంది. చిన్న సినిమాలు, మిడ్ రేంజ్ మూవీస్ మాత్రం సాధారణ ధరలతోనే థియేటర్లలో విడుదలవుతున్నాయి. రెమ్యునరేషన్లు, ప్రొడక్షన్, ప్రమోషన్స్ వెరసి సినిమాల కోసం భారీగానే పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని నిర్మాతలు అంటున్నారు. స్టార్ హీరోల సినిమాలు సైతం రెండు, మూడు వారాలకు మించి థియేటర్లలో ఆడటం లేదు. తక్కువ టైమ్‌లోనే తాము పెట్టిన పెట్టుబడిని వెనక్కి రప్పించుకోవడం కోసం టికెట్ రేట్లను పెంచుతున్నామని ప్రొడ్యూసర్లు వాదిస్తున్నారు. ఫస్ట్ వీకెండ్‌లోనే లాభాల్లోకి ఎంటర్ కావాలనే ప్రయత్నంలో ఒకరికి మించి మరొకరు నిర్మాతలు ధరలను పెంచుతూ పోతున్నారు. ఓటీటీ ట్రెండ్ పెరగడానికి ఒకరకంగా ఈ టికెట్ రేట్ల పెరుగుదలే కారణమని పరిశీలకులు భావిస్తున్నారు.

ఉత్కంఠగా లార్డ్ టెస్ట్

- టీమిండియా లక్ష్యం 193
- నాల్గో రోజు ఆట ముగిసేసరికి స్కోరు 58/4
- ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ 192/10
- సుందర్ 4 వికెట్ల మాయాజాలం
- రాణించిన బుమ్రా, సిరాజ్

లార్డ్స్‌లో వాషింగ్టన్ సుందర్ (4/22) మాయ చేశాడు. మిడిల్ ఆర్డర్‌తో మొదలెట్టిన సుందర్..టెయిలెండర్లనూ పడగొట్టాడు. జస్‌ప్రీత్ బుమ్రా (2/38), మహ్మద్ సిరాజ్ (2/31) సైతం మెరవటంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 192 పరుగులకు కుప్పకూలింది. జో రూట్ (40), బెన్ స్టోక్స్ (33) రాణించగా భారత్‌కు ఇంగ్లాండ్ 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

లండన్ : లార్డ్స్ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇరు జట్లు సమవుజ్జీలుగా నిలువగా.. రెండో ఇన్నింగ్స్ షూటౌట్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ 192 పరుగులు చేసింది. పిచ్ బ్యాటింగ్‌కు కష్టసాధ్యంగా మారగా.. స్పిన్‌కు సైతం అనుకూలించటం మొదలెట్టింది. దీంతో వాషింగ్టన్ సుందర్ (4/22) ఇంగ్లాండ్ తోక కత్తిరించాడు. సుందర్ మాయజాలంతో ఇంగ్లాండ్ ఆఖరు 4 వికెట్లను 11 పరుగులకే కోల్పోయింది. 62.1 ఓవర్లలో ఆ జట్టు 192 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (40, 96 బంతుల్లో 1 ఫోర్), బెన్ స్టోక్స్ (33, 96 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. ఒలీ పోప్ (4), జేమీ స్మిత్ (8)లు స్వల్ప స్కోర్లకు నిష్క్రమించారు.

ఆ ఇద్దరు మెరిసినా : ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 192 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్లు జాక్ క్రాలీ (22), బెన్ డకెట్ (12) ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. ఫామ్‌లో ఉన్న ఒలీ పోప్ (4) సైతం తేలిపోయాడు. మహ్మద్ సిరాజ్ ఉదయం సెషన్ ఆరంభంలోనే ఈ ఇద్దరిని సాగనంపాడు. జాక్ క్రాలీని నితీశ్ అవుట్ చేయగా ఇంగ్లాండ్ 50/3తో నిలిచింది. ఈ దశలో జో రూట్ (40), హ్యారీ బ్రూక్ (23) నాల్గో వికెట్‌కు 41 బంతుల్లోనే 37 పరుగులు జోడించారు. ఆకాశ్ దీప్ మెరుపు వేగంతో బ్రూక్ వికెట్లను గిరాటేశాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (33)తో జతకలిసిన రూట్ ఐదో వికెట్‌కు 128 బంతుల్లో 67 పరుగులు జత చేశాడు. రూట్, స్టోక్స్ క్రీజులో ఉండగా ఇంగ్లాండ్ భారీ స్కోరు దిశగా సాగింది.

154/4తో నిలిచిన ఇంగ్లాండ్‌ను వాషింగ్టన్ సుందర్ కట్టడి చేశాడు. జో రూట్, బెన్ స్టోక్స్ సహా విధ్వంసకర బ్యాటర్ జెమీ స్మిత్ (8)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. సుందర్ మాయకు చివరి 4 వికెట్లకు 11 పరుగులకే చేజార్చుకున్న ఇంగ్లాండ్.. ఆఖరు ఆరు వికెట్లను 38 పరుగులకే కోల్పోయింది. టెయిలెండర్లలో క్రిస్ వోక్స్ (10) ఒక్కడే రెండెంకల స్కోరు అందుకున్నాడు. బ్రైడన్ కార్స్ (1), షోయబ్ బషీర్ (2)లు పేస్, స్పిన్‌కు దాసోహం అయ్యారు. పరుగుల వేట గగనమైన పిచ్‌పై భారత బౌలర్లు అంచనాలను అందుకున్నారు. 192 పరుగులకే ఇంగ్లాండ్‌ను ఆలౌట్ చేశారు. కానీ మన బౌలర్లు క్రమశిక్షణ పాటించలేదు. ఫలితంగా, 32 పరుగులను ఎక్స్‌ట్రాల రూపంలో ఇచ్చుకున్నారు. లార్డ్స్ టెస్టు ఫలితంలో ఈ ఎక్స్‌ట్రాలు కీలక పాత్ర పోషించే అవకాశం లేకపోలేదు!.

టీమిండియా 59/4

నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా నాలుగు వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. క్రీజులో కెఎల్ రాహుల్ ఉన్నాడు. టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్‌గా వచ్చిన జైస్వాల్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అనంతరం కరుణ్‌నాయర్, శుభ్‌మన్‌గిల్, ఆకాశ్ దీప్ వడివడిగా పెవిలియన్‌కు చేరారు.

మెరిసిన షెఫాలీ

- ఐదో టీ20లో ఇంగ్లాండ్ గెలుపు

బర్మింగ్‌హామ్ : సిరీస్ చేజారినా.. ఆతిథ్య ఇంగ్లాండ్ ఊరట విజయం దక్కించుకుంది. బర్మింగ్‌హామ్‌లో జరిగిన భారత్, ఇంగ్లాండ్ మహిళల ఐదో టీ20లో ఆతిథ్య జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 168 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ఆఖరు బంతికి ఛేదించింది. ఓపెనర్లు డానీ (56, 37 బంతుల్లో 9 ఫోర్లు), సోఫియా (46, 30 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) సహా టామీ (30, 20 బంతుల్లో 5 ఫోర్లు) రాణించారు. దీప్తి శర్మ (2/31), అరుంధతి రెడ్డి (2/47) మెరిసినా.. భారత్‌కు ఓటమి తప్పలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. డబ్ల్యూపీఎల్ ఫామ్‌తో ఇంగ్లాండ్ టూర్‌కు వచ్చిన షెఫాలీ వర్మ.. 10 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించింది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌ను 3-2తో టీమ్ ఇండియా గెల్చుకుంది. పది వికెట్లతో మెరిసిన తెలుగమ్మాయి శ్రీ చరణి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచింది.

వింబుల్డన్ విజేత జన్నిక్ సిన్నర్

- ఫైనల్లో ఓడిన అల్కరాస్

లండన్: ఇటలీ కుర్రాడు, ప్రపంచ నెం.1 జన్నిక్ సిన్నర్ వింబుల్డన్ ఫైనల్‌లో అదరగొట్టాడు. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్‌లో గత రెండు సీజన్లలో టైటిల్ నెగ్గిన రెండో సీడ్, డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాస్‌ను (4-6, 6-4, 6-4, 6-4) వరుస సెట్లలో మట్టికరిపించి టైటిల్‌ను ఎగరేసుకుపోయాడు. నువ్వానేనా అన్నట్లు సాగిన ఫైనల్‌లో తొలి సెట్‌ను కోల్పోయిన సిన్నర్ ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్నాడు. ఒత్తిడిని చిత్తుచేస్తూ వరుస సెట్లలో విజయం సాధించాడు. సినర్‌కు ఇదే తొలి వింబుల్డన్ టైటిల్ కావడం విశేషం. కేరీర్‌లో నాలుగో గ్రాండ్ స్లామ్ టైటిల్. ఆదివార విజయంతో గత నెలలో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో అల్కరాస్ చేతిలో జరిగిన పరాభవానికి సిన్నర్ బదులు తీర్చుకున్నట్లయింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68